

పత్తి కొనుగోలుకు సిద్ధం

పత్తి ధర తగ్గడంతో మార్కెటింగ్ శాఖ అప్రమత్తమైంది. ప్రభుత్వ రంగ సంస్థలను రంగంలో దించేందుకు సన్నాహాలు చేస్తోంది. దీపావళి నాటికి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ)ని రంగంలోకి దించి పత్తిని కొనుగోలు చేయాలని చూస్తోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర గతేడాది కంటే రూ. 589 పెంచింది. ఈ ఏడాది కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ. 8,110గా నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాలో ఈనెల 21 నుంచి సీసీఐ కేంద్రాలు తెరవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే విక్రయానికి మార్గదర్శకాలు ప్రకటించారు.

● ఆదోని అగ్రికల్చర్, ఆంధ్రజ్యోతి



ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

- దీపావళి నాటికి సీసీఐ కేంద్రాలు
- సీసీఐకి, జిన్నర్ల మధ్య కుదిరిన ఏకాభిప్రాయం
- పత్తి ధర పతనం కావడంతో అప్రమత్తమైన మార్కెటింగ్ శాఖ
- మద్దతు ధర క్వింటా రూ. 8,110తో కొనుగోలుకు చర్యలు
- కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు తప్పనిసరి

జిల్లాలో ఈ ఏడాది 2.27 లక్షల హెక్టార్లలో పత్తిసాగు అయినట్లు అధికారులు చెబుతున్నారు. ముందస్తు వర్షాలు కురవడంతో పత్తి పంటను ఉత్సాహంగా సాగు చేశారు. ఆగస్టు, సెప్టెంబరులో ఎడతెరిపిలేని వర్షాలతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. అధిక వర్షాలకు రైతులను కొంత నష్టపరిచి దిగుబడిపై ప్రభావం చూపింది. ఖరీఫ్ పంట చేతికందడంతో రైతులకు వచ్చిన అరకొర దిగుబడిని విక్రయానికి మార్కెట్ కమిటీకి తీసుకొస్తున్నారు. పంట చేతికొచ్చిన సమయంలో అమాంతంగా పత్తి ధర భారీగా పతనమైంది. క్వింటా గరిష్ఠంగా రూ. 7,300 మించి ధర ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పలకడం లేదు. ఇప్పటి వరకు పలికిన మధ్య ధర గరిష్ఠ రూ. 6,500 మాత్రమే పలుకుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే క్వింటా రూ. 1,200 ధర తక్కువగా పలుకుతోంది. ఈ నేపథ్యంలో కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ. 8,110తో పత్తిని కొనుగోలు చేయనున్నారు.



సీసీఐ కార్యాలయం

జిల్లాలో 20పైగా కొనుగోలు కేంద్రాలు

జిల్లాలో 20పైగా కొనుగోలు కేంద్రాలు తెరవాలని రెండు రోజుల క్రితం జరిగిన సమావేశంలో జాయింట్ కలెక్టర్ నవ్య సీసీఐకి సూచించారు. వ్యవసాయ శాఖ దిగుబడి అంచనా వేసి అధికారులకు అందించారు. ఈ-క్రాపు బుకింగ్ కూడా 90 శాతం పైగా పూర్తయినట్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈనెల 21లోపు పూర్తిగా ఈ-క్రాపు బుకింగ్ నమోదు చేయాలని ఆదేశించారు. ఆదోనిలో 15, ఎమ్మిగనూరులో 3, మంత్రాలయం 2, పెంచికలపాడు ఒకటి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

జిన్నర్లతో కుదిరిన సయోధ్య

సీసీఐ కొనుగోలు చేసిన పత్తిని జిన్నింగ్ దూదిగా మార్చి బేళ్లుగా తయారు చేసేందుకు టెండర్లను ఆహ్వానించింది. సీసీఐ నిబంధనలు భారీగా పెట్టడంతో నెల రోజులుగా పరిశ్రమ యాజమానులు ఎవరూ కూడా టెండర్ దాఖలు చేయడానికి ముందుకు రాలేదు.

మిగతా 8వ పేజీలో

ఈ-పంట నమోదు సక్రమంగా జరగాలి



కర్నూలు కలెక్టరేట్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈ-పంట నమోదు సక్రమంగా జరగాలని కలెక్టర్ డాక్టర్ సిరి వ్యవసాయ శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉల్లికి సంబంధించి మన రాష్ట్రంలోనూ, ఇతర రాష్ట్రాల్లోనూ మార్కెట్ ధరలు పరిశీలించి గ్రామాల్లోని రైతులకు వాటిపై అవగాహన కల్పించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఉద్యాన శాఖ అధికారి రాజా కృష్ణారెడ్డి, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ సహాయ సంచాలకులు రాజశేఖర్, విజిలెన్స్ ఏవో, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జేడీగా వరలక్ష్మికి పదోన్నతి



కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు వ్యవసాయ శాఖలో డిప్యూటీ డైరెక్టర్‌గా కొనసాగుతూ ఇన్‌చార్జి జేడీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వరలక్ష్మికి రెగ్యులర్ జేడీగా శుక్రవారం పదోన్నతి కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా డిప్యూటీ డైరెక్టర్లుగా ఏళ్ల తరబడి కొనసాగుతూ ఇన్‌చార్జి జేడీలుగా బాధ్యతలు మోస్తున్న వ్యవసాయ శాఖలోని అధికారులకు ప్రభుత్వం ఎట్టకేలకు కరుణ చూపింది. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది, యూనియన్ నాయకులు జేడీ వరలక్ష్మికి అభినందనలు తెలిపారు.

స్వచ్ఛమైన గ్రామాలుగా తీర్చిదిద్దాలి

జడ్పీ సీఈవో నాసరరెడ్డి



కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామాలను స్వచ్ఛమైన గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి అన్నారు. శుక్రవారం జడ్పీ ఆవరణలోని జిల్లా శిక్షణ వనరుల కేంద్రంలో ఏపీఎస్ఐఆర్డీ అండ్ పీఆర్ కమిషనర్ ఆదేశాల మేరకు శుభ్రత-పరిశుభ్రత అనే అంశంపై కర్నూలు జిల్లాలోని డిప్యూటీ ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులకు ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ పరిశుభ్రమైన గ్రామాలుగా పంచాయతీలను తీర్చిదిద్దడానికి పని చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లకు ఇరువైపులా చెట్లు నాటి పచ్చదనాన్ని పెంచాలన్నారు. పారిశుధ్యం, పరిశుభ్రతకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛరథంలో భాగంగా త్వరలో ఒక మండలానికి ఒక స్వచ్ఛరథం ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామ పంచాయతీలను కవర్ చేస్తూ పొడి వ్యర్థాలకు బదులుగా నిత్యావసర సరుకులను ప్రజలకు ఇవ్వడం దీని ప్రధాన ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ జిల్లా కో ఆర్డినేటర్ మంజులవాణి, శిక్షణ మేనేజర్ గిడ్డేష్, టీవోటీలు ఎస్.అ్రష్ బాషా, పి.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కృషి



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా , మంత్రి టీజీ

- డబుల్ ఇంజన్ సర్కార్ చేతల ప్రభుత్వం
- కూటమి నాయకుల సమన్వయంతో సభ విజయవంతం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ రావు
- ఇండస్ట్రియల్ హబ్‌కు రూ.10 వేల కోట్లు
- ఫేక్ ప్రచారాలతో వైసీపీ రాజకీయం
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి టీజీ భరత్, జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్ చేతల ప్రభుత్వమన్నారు. 'సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్' కార్యక్ర మాన్ని విజయవంతం చేయడానికి కూటమి నాయకులు సమన్వయంతో పని చేశారన్నారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ మోదీ సభ ఏర్పాటుల్లో కలెక్టర్, ఎస్పీ కృషి అభినందనీయమన్నారు. చరిత్రలో ఎన్నడు లేని విధంగా ప్రపంచం మొత్తం కర్నూలు వైపు చూసే విధంగా మోదీ నిధులు ప్రకటించారని, కర్నూలు ఇండస్ట్రియల్ హబ్‌కు రూ.10వేల కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ఇప్పటికే అవసరమైన ప్రక్రియ పూర్తయిందన్నారు. వైసీపీ ఫేక్ ప్రచారాలతో రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా ఎయిర్ పోర్టులో ఆయన్ను కలిసి మెడికల్ కళాశాలల విషయంలో వినతి పత్రం ఇచ్చారని ఫేక్ ప్రచారం చేస్తోందన్నారు. ఈ సమావేశంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, బొగ్గుల దస్తగిరి, జనసేన జిల్లా అధ్యక్షుడు సురేష్, డీసీఎంఎస్ చైర్మన్ వై. నాగేశ్వరరావుయాదవ్, ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి, ఆకెపోగు ప్రభాకర్, నాయకులు పాల్గొన్నారు.

నష్టాల ఉల్లి

- పతనమైన ధర
- క్వింటాం కనిష్ఠ ధర రూ.209
- లబోదిబోమంటున్న రైతులు



మార్కెట్ యార్డులో ఉల్లి బస్తాలు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఈఏడాది ఉల్లి రైతులు నష్టాల బాట పట్టారు. కర్నూలు మార్కెట్ యార్డులో ఉల్లి రైతుల గగ్గోలు మళ్లీ మొదలైంది. శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి అమ్మకానికి తెచ్చిన ఉల్లికి గిట్టుబాటు ధర అందక రైతులు కన్నీరు మున్నీరయ్యారు. మార్కెట్ యార్డుకు 1,748 క్వింటాళ్ల ఉల్లి అమ్మకానికి వచ్చింది. గరిష్ఠ ధర రూ.1,179లు, మధ్యస్థ ధర రూ.511, కనిష్ఠ ధర రూ.209లు మాత్రమే రైతులకు అందింది. రూ.209 కనిష్ఠ ధర అందడంతో కొంత మంది రైతులు కనీసం రవాణా ఖర్చులు కూడా సర్దుబాటు కాక కమీషన్ ఏజెంట్లతో అప్పు తీసుకొని డ్రైవర్లకు ఇచ్చారు. దీంతో ఉల్లి రైతులు లబోదిబోమంటున్నారు. మిగిలిన పంట ఉత్పత్తుల ధరలు కూడా ఘోరంగా పడిపోయాయి. కర్నూలు మార్కెట్‌కమిటీ అధికారులు నాణ్యతను బట్టి రైతులకు గిట్టుబాటు ధర అందించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. టెండరు దాఖలు చేసే సమయంలో, తూకాలు వేసే సమయంలో దరిదాపుల్లో కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూటమి నేతల్లో జోష్



- ఎన్టీఆర్ చైతన్య రథయాత్ర తర్వాత ఆ స్థాయిలో మోదీ సభ
- జీఎస్టీ 2.0 సభ సూపర్ సక్సెస్
- సమష్టి కృషి సఫలం.. వెల్లువలా తరలివచ్చిన జనం



కర్నూలు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బహుముఖ ప్రజ్ఞతో సినీ రంగంలో, కోట్లాది హృదయాల్లో పదిలమైన స్థానం సొంతం చేసుకున్న యుగపురుషుడు ఎన్టీఆర్ 1982లో తెలుగు దేశం పార్టీ స్థాపించిన తరువాత చైతన్య రథయాత్రలో భాగంగా కర్నూలుకు వ చ్చారు. ఆసమయంలో రహదారులు జనవరద కట్టాయి. 1992-93 మధ్యలో సింహగర్జన సభకు లక్షలాదిగా ప్రజలు తరలివచ్చారు. ఆ తర్వాత ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆ స్థాయిలో జరిగిన బహిరంగ సభ ప్రధాని మోదీ హాజరైన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ సభనే అంటున్నారు రాజకీయ విశ్లేషకులు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంతోని కూటమి ప్రభుత్వం, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ప్రతిష్ఠాత్మకంగా సభా ఏర్పాట్లు, జన సమీకరణ చేపట్టినా.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మన జిల్లాకు వస్తున్నారు.. ఆయనను చూడాలి.. స్ఫూర్తి మాటలు వినాలన్నా సంకల్పంతో నేను సైతం అంటూ.. వెల్లువలా ప్రజలు తరలివచ్చారు. రాగమయూరి గ్రీన్‌హిల్స్ జనతోటగా మారింది. ఆనాడు రాజకీయాలకు అతీతంగా ఎన్టీఆర్‌ను చూడాలని స్వచ్ఛందంగా ప్రజలు ఎలా తరలివచ్చారో.. గురువారం జరిగిన ప్రధాని మోదీ సభకు కూడా అదేవిధంగా తరలిరావడం కొసమెరుపు. మొత్తం మీద ప్రధాని సభకు 3.50 లక్షల నుంచి 4 లక్షల దాకా ప్రజలు వచ్చి ఉంటారని అంచనా. సూపర్ జీఎస్టీ-సూపర్ సక్సెస్ సభ సూపర్ హిట్ కావడంతో కూటమి నేతల్లో జోష్ నింపింది.

● **నాడు ఎన్టీఆర్:** 1983లో తెలుగుదేశం పార్టీ స్థాపించి చైతన్య రథయాత్ర పేరిట ఎన్టీఆర్ జనం ముంగిటకు వచ్చారు. ఆనాడు ఎన్టీఆర్ సైతం శ్రీశైలం నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లా పర్యటనకు శ్రీకారం చుట్టారు. శ్రీశైల జ్యోతిర్లింగం, శక్తిపీఠ క్షేత్రాలు దర్శించుకొని మల్లికార్జునస్వామి, భ్రమరాంబికాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి చైతన్య రథం ఎక్కారు. ఆత్మకూరు, నందికొట్కూరు మీదుగా కర్నూలు నగరం చేరుకున్నారు. ఎన్టీఆర్ రాక కోసం ప్రజలు రోడ్లపైనే రోజుల తరబడి నిరీక్షించారు. అధికారం చేపట్టాక 1983లో పాణ్యంలో నిర్వహించిన రూ.2 కిలో బియ్యం ప్రారంభ సభకు ప్రజా జాతర అయింది. 1992-93 మధ్య కర్నూలులో జరిగిన సింహగర్జన సభకు మేము సైతం అంటూ జనఉప్పెన ఉరకలేసింది.

● **నేడు మోదీ:** ప్రధాని మోదీ సైతం ఉమ్మడి జిల్లా కర్నూలు జిల్లా పర్యటనను శ్రీశైలం నుంచి మొదలు పెట్టారు. ఢిల్లీ నుంచి కర్నూలు (ఓర్వకల్లు) విమానాశ్రయం చేరుకున్న ఆయన ముందుగా శ్రీశైలం చేరుకున్నారు. శ్రీశైల జ్యోతిర్లింగం, శక్తిపీఠ క్షేత్రాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆ అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో కర్నూలుకు చేరుకున్నారు.

మిగతా 9వ పేజీలో



పాణ్యంలో రూ.2 కిలో బియ్యం ప్రారంభ సభలో నాటి సీఎం ఎన్టీఆర్ సభకు హాజరైన అశేషజనవాహిని (ఫైల్)

జీజీహెచ్ సీఎస్ఆర్ఎంవోగా పద్మజ



కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సివిల్ సర్జన్ ఆర్ఎంవోగా డాక్టర్ పి.పద్మజ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా డిప్యూటీ సివిల్ సర్జన్లకు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సివిల్ సర్జన్లకు పదోన్నతులు కల్పించారు. ఇందులో భాగంగా నెల్లూరు జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వోగా పని చేస్తున్న పద్మజను సివిల్ సర్జన్‌గా పదోన్నతి కల్పించి కర్నూలు జీజీహెచ్ సివిల్ సర్జన్ ఆర్ఎంవోగా నియమించారు. కొత్తగా విధుల్లో చేరిన పి.పద్మజ కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిశారు. హాస్పిటల్‌కు వచ్చే ప్రతి రోగికి మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని, వైద్య సిబ్బంది సహకారంతో ఆసుపత్రిని అభివృద్ధి చేస్తానని ఆమె తెలిపారు.

డిగ్రీ, పీజీ కోర్సులకు దరఖాస్తులు

కర్నూలు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో నాలుగేళ్ల డిగ్రీ, పీజీ కోర్సులకు దరఖాస్తులు చేసుకోవాలని రిజిస్ట్రార్ లోక్‌నాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో లాటరల్ ఎంట్రీలో ప్రవేశానికి బీఎస్సీ, బీకాం, బీఏ, బీసీఏ ఆనర్స్ కూడా అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తులను ఉర్దూ వర్సిటీలో ఈనెల 25లోపు అందజేయాలని కోరారు.

శ్రీకృష్ణ దేవరాయలు జయంతిని అధికారికంగా నిర్వహించాలి

బలిజ సంఘం కర్నూలు నగర అధ్యక్షుడు గాండ్ల లక్ష్మన్న



శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి నివాళులర్పిస్తున్న నగర బలిజ సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విజయనగర సామ్రాజ్యాన్ని పాలించిన మహాయోధుడు, శ్రీకృష్ణ దేవరాయలు జయంతితో పాటు పట్టాభిషేక మహోత్సవాన్ని రాష్ట్ర పభుత్వం అధికారికంగా నిర్వహించాలని కర్నూలు నగర బలిజ సంఘం అధ్యక్ష కార్యదర్శులు గాండ్ల లక్ష్మన్న, మండ్లెం రవికుమార్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీకృష్ణ దేవరాయలు 496వ వర్ధంతి సందర్భంగా, నగరంలో కిసాన్‌ఘాట్ సమీపంలోని శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహానికి నగర బలిజ సంఘం ఆధ్వర్యంలో పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాండ్ల లక్ష్మన్న, మండ్లెం రవికుమార్ మాట్లాడుతూ సీమలో ఎన్నో చెరువులు, కాలువలు తవ్వించి, దేవాలయాలకు భూరి విరాళాలు అందజేసి, తెలుగు నేలకు రాయలవారు చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. తెలుగు భాష వైభవాన్ని పెంపొందించిన రాయలవారు అష్టదిగ్గజ కవులతో సాహిత్యానికి పెద్దపీట వేశారన్నారు. నగరంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన కాపుభవన్ నిర్మాణం పూర్తి చేయాలని, తగిన నిధులు కాపు భవన్‌కు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్జా రామకృష్ణ, సంఘ ప్రధాన సలహాదారు డాక్టర్ సింగంశెట్టి సోమశేఖర్, ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌కుమార్, కార్యవర్గ సభ్యులు ఓంకార్, అంజనేయులు, శ్రీనివాసులు, శోభన్‌బాబు, వెంకటేశ్వర్లు, గోపీనాథ్, మురళీమోహన్, మధుబాబు, అపురూప్, రామిరెడ్డి, రంగస్వామి, మునయ్య, మురళీ తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలుకు సిద్ధం

(7వ పేజీ తరువాయి)



ప్రభుత్వం చొరవ చూపించి సీసీఐతో చర్చలు జరిపి నిబంధనలు సడలించే ఏర్పాటు చేయడంతో వారి మధ్య సయోధ్య కుదిరింది. దీంతో టెండర్లు కూడా రెండు రోజుల్లో పూర్తయి జిన్నింగ్ పరిశ్రమలు ఎంపిక కానున్నాయి.

కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకుంటేనే..

రైతులు కపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో జిల్లా, మండలం, గ్రామంతోపాటు తన పేరును, పండించిన పత్తి దిగుబడిని నమోదు చేయాల్సి ఉంటుంది. యాప్‌లోనే సీసీఐ నిర్వాకులు కొనుగోలుకు సంబంధించిన వివరాలను రైతులకు తెలియజేస్తారు. ఫలానా తేదీలో రైతు సీసీఐ కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచిస్తుంది.

సీసీఐ నిబంధనలు

కేంద్ర ప్రకటించిన మద్దతు ధర రైతులు కందాలంటే తప్పకుండా ఈ నిబంధనలు పాటించాలని సూచిస్తుంది. బన్నీ/బ్రహ్మ పత్తిపింజ పొడుగు 20.50-30.50 ఎంఎం, మైక్రోనైర్ 3.50-4.30 ఉండాలి. తేమశాతం 8 నుంచి 12 శాతానికి మించకూడదు. 12 శాతం మించితే కొనుగోలు చేయరు. 8 నుంచి 12 శాతం వరకు పెరిగిన ప్రతి ఒక్క శాతంను 1 శాతం చొప్పున మద్దతు ధరలో తగ్గిస్తారు. 12 శాతం మించితే పత్తిని కొనుగోలు చేయరు. రైతులు తప్పనిసరిగా వాడుకంలో ఉన్న బ్యాంకు ఖాతా నంబర్, ఆధార్ నెంబర్ అనుసంధానం చేసుకొని ఉన్న బ్యాంకులకు నేరుగా కొనుగోలు చేసిన వారం రోజుల్లో వారి ఖాతాలో జమ చేస్తారు.

యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి



ప్రస్తుతం మార్కెట్‌లో పత్తిధర పతనమైన మాట వాస్తవమే. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని సీసీఐ రంగంలోకి దించింది. త్వరలోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు అవుతాయి. ముందుగానే రైతులు కాపాస్ కిసాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

● గోవిందు, కార్యదర్శి మార్కెట్ యార్డ్ ఆదోని

దీపావళి అయిన వెంటనే కొనుగోలు

రైతులు తక్కువ ధరకు అమ్ముకోకుండా ప్రభుత్వం సీసీఐ ద్వారా కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయాలని తమకు సూచించింది. ఇప్పటికే తాము జిన్నింగ్ ప్రెస్సింగ్ పరిశ్రమలను ఎంపిక కోసం కసరత్తు చేస్తున్నాం. ఆదోని ఎమ్మిగనూరు, మంత్రాలయం, పెంచికలపాడు కేంద్రాలలో దీపావళి అయిన వెంటనే పత్తిని రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేస్తాం.

● భరత్, సీసీఐ కేంద్రం జిల్లా ఇన్‌చార్జి

22 నుంచి యాగంటిలో కార్తీక ఉత్సవాలు



పోస్టర్‌ను విడుదల చేస్తున్న బీసీ ఇందిరమ్మ, అధికారులు

బనగానపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వర స్వామి కార్తీకమాస ఉత్సవాలు ఈనెల 22వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ పాండురంగారెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఈఓతో పాటు టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ, మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వర్ రెడ్డిలు శుక్రవారం మంత్రి బీసీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ ఈనెల 22 నుంచి నవంబరు 20వతేదీ వరకు యాగంటిలో కార్తీక మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 27న కార్తీక మాసం తొలి సోమవారం, నవంబరు 3న కార్తీకమాస రెండవ సోమవారం నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబరు 5న కార్తీక పౌర్ణమి మహోత్సవ వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా కార్తీక లక్ష దీపోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోడ్లు భవనాల శాఖమంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హాజరవుతారన్నారు. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, దేవదాయశాఖ ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్, ఉపకమిషనర్ పట్టెం గురుప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా యాగంటి క్షేత్రంలో రాత్రి 8 గంటలకు కర్నూలుకు చెందిన కర్నూలుకు చెందిన టీజీవి కళాక్షేత్రం, బనగానపల్లెకు చెందిన అరుణభారతీ సాహితీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పౌరాణిక నాటక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పడకసీను, భవానీ సీను, గయోపాఖ్యానం, తులాభారం, సత్యహరిశ్చంద్ర కాటిసీను నాటకాల ప్రదర్శన ఉంటుందన్నారు. నవంబరు 10 వతేదీన కార్తీక మాసం మూడవ సోమవారం, 17న చివరి సోమవారం సందర్భంగా పూజలు ఉంటాయన్నారు. 17వ తేదీ రాత్రి 'రేలారే రేలా' కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో యాగంటిపల్లె ఉపసర్పంచ్ మౌళీశ్వరరెడ్డి, భక్తుల సౌకర్యార్థం ఉమామహేశ్వర నిత్యాన్నదానసంస్థ, ఉమామహేశ్వర రైతు సంఘం ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణరెడ్డి, శ్రీరాములు, భరతుడు, యాగంటిపల్లె దస్తగిరి, జోలాపురం తిరుమలయ్య, శంఖేశ్వరరెడ్డి, కృష్ణయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా



శ్రీమఠంలో ప్రదక్షిణ చేస్తున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, టీడీపీ నాయకులు

మంత్రాలయం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు శుక్రవారం ఉదయం రాఘవేంద్రస్వామిని దర్శించుకున్నారు. గురువారం రాత్రి మంత్రాలయంలోని అబోడే త్రీస్టార్ హోటల్‌లో బస చేసిన విషయం తెలిసిందే. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, ఉమాపతి నాయుడుకు ముఖద్వారం వద్ద శ్రీమఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్‌జోషి, మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్వర్లు, మంచాల సింగిల్ విండో అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అమర్నాథరెడ్డి, రమాకాంత్‌రెడ్డి, విజయరామిరెడ్డి, రాకేష్ రెడ్డి, ఎంపీటీసీ వెంకటేష్, బెస్త పవన్‌కుమార్, చిన్నభీమాలు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల నిజ బృందావనానికి విశేష పూజలు చేశారు. ఏకాదశి కావడంతో ప్రత్యేక పూజలులేకపోవడంతో మఠం పండితులు శేషవస్త్రంకప్పి ఆశీర్వదించారు. వీరి వెంట నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జీపీగా న్యాయవాది కృష్ణమూర్తి

● ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



కర్నూలు లీగల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా గవర్నమెంటు ప్లీడర్(జీపీ)గా సీనియర్ న్యాయవాది బి.కృష్ణమూర్తిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. నంద్యాల జిల్లా మిడుతూరు మండలం పైపాళెం గ్రామానికి చెందిన కురువ నారాయణ, రాములమ్మల కుమారుడు బుల్కొండ కృష్ణమూర్తి మిడుతూరులోనే ప్రాథమిక విద్యాభ్యాసాన్ని పూర్తి చేశారు. అనంతరం ఇంటర్మీడియట్, న్యాయవిద్యను కర్నూలులో పూర్తి చేశారు. ప్రముఖ క్రిమినల్ లాయర్ డీసీ సుబ్బన్న ఆఫీసులో జూనియర్‌లాయర్‌గా ప్రాక్టీస్ మొదలుపెట్టిన కృష్ణమూర్తి 30 ఏళ్లుగా పలు సంక్లిష్టమైన కేసుల్లో తన వాదనను వినిపించారు. ఈ క్రమంలో కృష్ణమూర్తి సేవలను గురించిన రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు జిల్లా గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమిస్తూ శుక్రవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పదవిలో ఆయన మూడేళ్లపాటు కొనసాగుతారు. కృష్ణమూర్తి నియామకంపై మిడుతూరు మండలం పైపాళెం గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా టీడీపీ లీగల్ సెల్ నాయకులు దాసెట్టి శ్రీనివాసులు, కేఈ జగదీష్ గౌడ్‌తో పాటు బార్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

చిత్రజ్యోతి

SINCE 1965

పంచాయతీ సెక్రటరీ



వింటేజ్ కపుల్ శివాజీ, లయ మరోసారి కలసి నటిస్తున్న చిత్రం నిర్మాణదశలో ఉంది. ఈటీవీ విన్‌తో కలసి శివాజీ నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయన పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్‌గా నటిస్తున్నారు. దీపావళి పండగ సందర్భంగా ఈ చిత్రం నుంచి శివాజీ లుక్ విడుదల చేశారు. తన కుటుంబంతో కలసి దీపావళి పండగ సెలబ్రేట్ చేసుకోవడానికి పటాసులు తీసుకెళుతున్న లుక్ అది. అన్యాయాన్ని సహించని వ్యక్తిగా, నిజాయతీపరుడిగా శివాజీ ఇందులో నటిస్తున్నారు. భార్యాబిడ్డలే అతని ప్రపంచం, వాళ్ల కోసం ప్రాణాలు ఇవ్వడానికైనా వెనుకాడని వ్యక్తి పాత్రలో శివాజీ అభినయం ఆసక్తికరంగా ఉంటుందని దర్శకుడు సుధీర్ శ్రీరామ్ చెప్పారు. చిత్రం టైటిల్, ఇతర విశేషాలు త్వరలో వెల్లడిస్తామన్నారు. అలీ, ధనరాజ్, ప్రిన్స్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

వంద శాతం హిట్ కొడతాం

సుధీర్ బాబు



సుధీర్ బాబు ప్రధాన పాత్రధారునిగా దర్శక ద్వయం వెంకటేశ్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'జటాధర'. ఈ సినిమా ద్వారా బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన టీజర్‌కు మంచి స్పందన లభిస్తోంది. తాజాగా ప్రిన్స్ మహేశ్‌బాబు సోషల్ మీడియా వేదికగా ట్రైలర్ రిలీజ్ చేశారు. ట్రైలర్‌లో భూత పిశాచాలు, శాపగ్రస్త ఆలయాలు, ఆధ్యాత్మిక యుద్ధాలను కళ్లు తిప్పుకోలేని విధంగా చూపించారు. సుధీర్ బాబు నేలపై ఉన్న రక్తం తాగుతూ తపస్సులోకి వెళ్లే సన్నివేశం ఒళ్లు జలదరింపజేస్తుంది. భయానక సన్నివేశాలతో పాటు భారతీయ పురాణ వైభవాన్ని కూడా అద్భుతంగా తెరకెక్కించారు. అనంతరం నిర్వహించిన వేడుకలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ 'ఈ సినిమాలో అద్భుతమైన కథ ఉంది. అంతకు మించిన భావోద్వేగాలుంటాయి. ధన పిశాచి పాత్రలో సోనాక్షి సిన్హా అదరగొట్టారు. ప్రేక్షకుల డబ్బులకు విలువ ఇచ్చినప్పుడు సినిమా వంద శాతం విజయం సాధిస్తుంది. 'జటాధర' కూడా వంద శాతం హిట్ కొడుతుంది. నవంబరు 7న కుటుంబ సభ్యులందర్నీ సినిమాకు తీసుకెళ్లండి' అని అన్నారు. నటి శిల్పా శిరోద్కర్ మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత 'జటాధర'తో తెలుగులో నటించడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు.

విజయం సాధించాం

సిద్ధు జొన్నలగడ్డ



"తెలుసు కదా' సినిమా చేయాలని అనుకున్నప్పుడు నా మనసులో ఒక భయం ఉండేది. ఆ భయం యాక్టర్‌గా కాదు రైటర్‌గా. ప్రతీ సన్నివేశంలో పంచులు లేకుండా ప్రేక్షకుల్ని మెప్పించగలమా అనే సందేహం ఉండేది. ఈ రోజు ఆ భయం పోయింది. థియేటర్ల ఎదుట హౌస్‌ఫుల్ బోర్డులు చూస్తుంటే మేము విజయం సాధించామనే ఆనందం కలిగింది. సినిమాకు అన్ని చోట్ల నుంచి అద్భుతమైన స్పందన వస్తోంది. ఆదరించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని అన్నారు హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన కథానాయకుడిగా నీరజ కోన తెరకెక్కించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బేనర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించింది. చిత్ర దర్శకురాలు నీరజ కోన మాట్లాడుతూ 'సినిమాకు వస్తున్న స్పందనను చూస్తుంటే చాలా ఎమోషనల్‌గా ఉంది. చిత్ర కథలో మేము కనెక్ట్ అయిన పాయింట్‌తో ప్రేక్షకులు కూడా అంతే అద్భుతంగా కనెక్ట్ అయ్యారు. మా నిర్మాతలు విశ్వ గారు, కృతి గారు, హీరో సిద్ధు, హీరోయిన్లు రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి, చిత్ర బృందం మొత్తానికి కృతజ్ఞతలు' అని అన్నారు. నటుడు వైవా హర్ష మాట్లాడుతూ 'మా చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు' అని చెప్పారు.

సందేశాత్మకం



జాతీయ అవార్డు గ్రహీత నరసింహ నంది దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. దైవ నరేశ్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఇటీవలే టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'మా సినిమా ప్రచార చిత్రాలకు చక్కని స్పందన వచ్చింది. కథానుసారం తెలంగాణ యాసలో కొన్ని పాత్రలు పలికిన సంభాషణలను కొందరు విమర్శించారు, కానీ సినిమా ఎవరినీ కించపరిచేలా ఉండదు. సందేశాత్మకంగా ఉంటుంది' అని చెప్పారు. త్వరలో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు తెలిపారు.



అనుబంధాలను ఆవిష్కరించే చిత్రం

'నేను నటించే సినిమాలు చాలా బావుంటాయి అనే ఇమేజ్‌ను ప్రేక్షకుల దగ్గర తెచ్చుకోవాలనేదే నా ప్రయత్నం. అది 'కె-ర్యాంప్' చిత్రంతో పూర్తిగా నెరవేరుతుందనే నమ్మకం ఉంది. కుటుంబ అనుబంధాలను తెరపై గొప్పగా ఆవిష్కరించే చిత్రమిది' అని కిరణ్ అబ్బవరం అన్నారు. ఆయన కథానాయకుడిగా జైన్స్ నాని దర్శకత్వం వహించిన చిత్రం 'కె-ర్యాంప్'. రాజేశ్ దండా, శివ బొమ్మక్ నిర్మించారు. నేడు ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. జైన్స్ నాని మాట్లాడుతూ 'మా సినిమాపై ప్రేక్షకుల్లో ఇప్పటికే ప్రచార చిత్రాలతో మంచి ఆసక్తి ఏర్పడింది. ఈ సినిమాలో డైలాగ్స్ ప్రేక్షకులకు బాగా నచ్చాయి. వాటిని ప్రేక్షకులు చెబుతుంటే చాలా సంతోషంగా అనిపించింది. ప్రథమార్థంలో ప్రేమకథా, ద్వితీయార్థంలో కుటుంబ అనుబంధాలు, భావోద్వేగాలు ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటాయి' అని చెప్పారు.

కూటమి నేతల్లో జోష్

(7వ పేజీ తరువాయి)

జీఎస్టీ 2.0 సంస్కరణల ప్రయోజనాలు ప్రజలకు వివరించేందుకు సూపర్ జీఎస్టీ - సూపర్ సక్సెస్ సభలో పాల్గొన్నారు. ఈ సభకు లక్షలాది ప్రజలు వెల్లువలా తరలివచ్చారు.

కూటమి నేతల్లో సంబరం

జీఎస్టీ 2.0 ఫలాలు ఇంటింటికి చేర్చాలి.. ప్రయోజనాలపై ప్రజల్లో చైతన్యం కలిగించాలనే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వేర్వేరు థీమ్స్‌తో ప్రచారం కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఇందుకు విద్య, ఐటీ మంత్రి నారా లోకేశ్ నాయకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే 98 వేలకు పైగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా దేశంలో తొలిసారిగా సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ పేరిట కర్నూలులో భారీ బహిరంగ సభ గురువారం నిర్వహించారు. ప్రధాని మోదీ పాల్గొన్న ఈ సభను విజయవంతం చేయడానికి రాష్ట్ర మంత్రులు, టీడీపీ, బీజేపీ, జనసేన అగ్ర నాయకత్వం నాలుగైదు రోజులు జిల్లాలోనే మకాం వేసి ఏర్పాట్లు మొదలు జన సమీకరణ వరకు సమష్టిగా కృషి చేశారు. రాష్ట్ర పాలన, అధికార యంత్రాంగం మొత్తం కర్నూలులోనే వాలిపోయింది. రాగమయూరి గ్రీన్ హిల్స్‌లో దాదాపు 350 ఎకరాల్లో ఏ ఒక్కరికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎన్ఎండీ ఫరూక్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ నాయకులు కృషి చేశారు.

అధికారుల కసరత్తు

కర్నూలులో 'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్'ను కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. మూడు లక్షలకుపైగా జన సమీకరణ అంచనాలు వేశారు. 6వ తేది రాత్రి వరకు సభా ప్రాంగణం స్థలం ఎక్కడో కూడా ఎంపిక చేయలేదు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా మంత్రి టీజీ భరత్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎమ్మెల్యేలు మూడు స్థలాలను పరిశీలించారు. అదే రోజు రాత్రికి రాగమయూరి గ్రీన్‌హిల్స్‌ను ఫైనల్ చేశారు. 14వ తేదీ సాయంత్రానినికల్లా సభా ప్రాంగణం ఎస్పీజీ అధికారులకు అప్పగించారు. ఎనిమిది రోజులు పదికిపైగా బృందాలుగా ఏర్పడిన అధికారులు పనులను శరవేగంగా ముగించారు.

ప్రధాని సభ విజయవంతంపై సీఎం చంద్రబాబు అభినందన





జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్లు రాజకుమారి, సిరి

కర్నూలు/నంద్యాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పర్యటన విజయవంతంపై కర్నూలు, నంద్యాల జిల్లాల అధికారులను సీఎం నారా చంద్రబాబు నాయుడు అభినందించారు. విజయవంతంలో మమేకమైన ప్రతి ఒక్కరికి పత్యేక అభినందనలు తెలియజేశారు. జీఎస్టీ 2.0 ఫలాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ పేరిట నిర్వహించిన భారీ బహిరంగ సభ, శ్రీశైలం పర్యటన విజయవంతం కావడంతో శుక్రవారం సాయంత్రం సీఎం చంద్రబాబు ఉండవల్లిలోని తన కార్యాలయం నుంచి మంత్రులు, ఉన్నతాధికారులు, కర్నూలు, నంద్యాల జిల్లా కలెక్టర్లు డాక్టర్ ఎ.సిరి, రాజకుమారి గణియా తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శ్రీశైలం మల్లన్న ఆలయ దర్శనం, శివాజీ మెమోరియల్ ట్రస్ట్ సందర్శన ఎంతో తృప్తి, సంతోషాన్ని ఇచ్చిందని మోదీ పేర్కొన్నట్లు చంద్రబాబు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లు సిరి, రాజకుమారి, ఎస్పీలు ఎస్పీ విక్రాంత్‌పాటిల్, సునీల్ షెరాన్, డీఆర్ఓ వెంకటనారాయణమ్మ, కర్నూలు ఆర్డీవో సందీప్‌కుమార్, వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ నీరజ, డీటీసీ శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో కౌలురైతు బలవన్మరణం

ఎమ్మిగనూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ కౌలురైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈఘటన పట్టణంలోని వెంకటాపురం కాలనీలో చోటుచేసుకుంది. కాలనీవాసులు, రైతులు తెలిపిన వివరాలు.. కాలనీకి చెందిన రాఘవేంద్ర (50)కు కొద్దిపాటి పొలం ఉంది. దీనికి తోడు రెండెకరాలు కౌలుకు తీసుకున్నాడు. మూడేళ్లుగా మిరప పంటను సాగుచేస్తున్నాడు. ఇంతకుముందు ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాకపోవటంతో పాటు ధరలు పడిపోయి తీవ్రంగా నష్టపోయాడు. ఈనష్టాన్ని ఈ ఏడాది అయినా పూడ్చుకుందామని అప్పులుచేసి మిరపను సాగుచేశా డు. అధికవర్షాలతో ఈఏడాదిసైతం పంట దెబ్బతింది. పంట సాగుకోసం రూ.5లక్షల అప్పులు చేశాడు. ఎలా తీర్చాలోనని మానసిక ఆందోళనకు గురయ్యాడు. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పనులకు వెళ్లి ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు ఇంట్లో రాఘవేంద్రను చూసి రోదించారు. చుట్టుపక్కల వారు వచ్చి కిందకు దించగా అతడు అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య మల్లేశ్వరమ్మ, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఒక కుమార్తెకు వివా హం చేశాడు. మరో ముగ్గురు పిల్లలు చదువుతున్నారు. పట్టణ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



రాఘవేంద్ర (ఫైల్)

సీనియర్ అసిస్టెంట్ మృతి

పాణ్యం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరెడ్డి(57) శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన కోలుకోలేక మరణించారు. శ్రీనివాసరెడ్డి మృతిపై తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన గతంలో నెరవాడ, కౌలూరు, కొత్తూరు ఉడుమాల్పురం ప్రాంతాల్లో నిర్వహించారన్నారు. శ్రీనివాసరెడ్డి మృతిపై మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు రామిరెడ్డి, మాజీ జడ్పీటీసీ సూర్యనారాయణ రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ జయరామిరెడ్డి, ఆర్ఐ రాము, డీటీ శివశంకరరెడ్డి, తొగర్చేడు గ్రామస్థులు తీవ్ర సంతాప వ్యక్తం చేశారు.



శ్రీనివాసరెడ్డి (ఫైల్)

కోటి సంతకాల సేకరణ

కల్లూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ ప్రారంభిస్తున్నట్లు నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 37వ వార్డులో ప్రజలతో సంతకాలు సేకరణ, రచ్చబండ నిర్వహించారు. ప్రభుత్వం పట్ల అప్పుడే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని, త్వరలో ప్రజలు ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారన్నారు.



సంతకాల సేకరణ ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే కాటసాని

బాణసంచా విక్రయాలకు అనుమతి ఉండాలి

- ఎస్పీ విక్రాంత్ పాటిల్



కర్నూలు క్రైం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బాణసంచా నిల్వ, విక్రయాలకు అనుమతి ఉండాలని, లేనిపక్షంలో ప్రేలుడు పదార్థాల చట్టం, ఐపీసీ సెక్షన్స్ ప్రకారం చర్యలు తప్పవని ఎస్పీ విక్రాంత్ పాటిల్ హెచ్చరించారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ సబ్ డివిజన్ ప్రాంతాల్లో టపాసుల విక్రయించే ప్రాంతాల్లో జాగ్రత్తలు, సూచనలు పాటించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రమాదాలకు తావులేకుండా భద్రతా ప్రమాణాలు పాటించాలని విక్రయదారులకు తెలియజేయాల న్నారు. కేటాయించిన ప్రదేశాల్లోనే దుకాణాలు ఏర్పాట చేసుకుని బాణసంచా విక్రయించాలన్నారు. నీరు, ఇసుక, తదతర అగ్నిమాపక సామగ్రిని విక్రయ దుకాణాల్లో సిద్దంగా ఉంచుకో వాలన్నారు. పిల్లలను విక్రయాల పనుల్లో ఉంచుకోరాదన్నారు. లైసెన్సు ఉన్న వ్యాపారులు మాత్రమే బాణాసంచా విక్రయాలు చేయాలన్నారు. దుకాణాల వద్ద అగ్నిమాపక వాహన, అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు.

వేడుకల్లో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రమాదం చోటు చేసుకున్నా, అక్రమంగా టపాసులు విక్రయిస్తున్నా డయల్-112, 100కి గానీ సంబంధిత పోలీసు స్టేషన్‌కు గానీ సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

సేవకు మారుపేరు ఆర్యవైశ్యులు

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



వాసవీ భవన్‌ను ప్రారంభించిన టీజీ వెంకటేశ్, మంత్రి టీజీ భరత్

కర్నూలు కల్చరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులంటే సేవకు మారుపేరని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. కర్నూలు నగర శివారు కల్లూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం ఆవరణలో కల్లూరు వాసవి సేవా ట్రస్ట్, కల్లూరు వాసవి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీవెంకటేశ్ వాసవీ భవన్‌ను రాష్ట్ర మంత్రి టీజీ భరత్, శిల్పా భరత్ దంపతులు ప్రారంభించారు. ఈ భవనానికి సంబంధించిన శిలాఫలకాన్ని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ కల్లూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం ఆవరణలో టీజీ లక్ష్మీ వెంకటేశ్ వాసవీ భవన్‌ను నిర్మించడం అభినందనీయమన్నారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఎక్కడ ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా సేవ చేసేందుకు ముందుగా గుర్తుకు వచ్చేది ఆర్యవైశ్యులు మాత్రమే అని అన్నారు. కార్యక్రమంలో కల్లూరు వాసవీ సేవా ట్రస్టు చైర్మన్ చిలమకూరు రాజశేఖర్, వైస్ చైర్మన్ రామలింగేశ్వర్, పారిశ్రామికవేత్త టీజీ శివరాజ్, ఇల్లూరు లక్ష్మయ్య పాల్గొన్నారు.

మరో విద్యార్థి మృతదేహం లభ్యం

- శోకసంద్రంలో విద్యార్థుల కుటుంబాలు





లభ్యమైన ఉదయ్‌కుమార్ మృత దేహం... హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన జీడీపీ అధికారులు

గోనెగండ్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు నీటిలో కొట్టుకుపోయిన మరో విద్యార్థి ఉదయ్ కుమార్ (20) మృతదేహం శుక్రవారం ఉదయం గజ ఈతగాళ్లు నీటి గుంత నుంచి బయటకు తీశారు. గురువారం సెంయిట్ జాన్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఎనిమిది మంది జీడీపీ సందర్శనకు వచ్చారు. అయితే ప్రమాదవశాత్తు చెన్నారెడ్డి, ఉదయ్‌కుమార్ గల్లంతయ్యారు. చెన్నారెడ్డి మృతదేహం గురువారమే లభ్యమైంది. ఉదయ్‌కుమార్ ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో శుక్రవారం గజ ఈతగాళ్లు మరోసారి గాలింపు చేపట్టగా ఉదయ్ కుమార్ మృతదేహం లభ్యమైంది. దీంతో తల్లిదండ్రులు గోవిందు, రాధ, స్నేహితులు, బంధువుల రోదనలతో ఆ ప్రాంతం శోకసంద్రగా మారిపోయింది తహసీల్దార్ రాజేశ్వరి శుక్రవారం ఉదయం 7 గంటలకు ప్రాజెక్టు ను చేరుకొని గత ఈతగాళ్లచే వెతికించడం ప్రారంభించారు. కొద్ది సేపటికే ఉదయ్‌కుమార్ మృతదేహం ఈతగాళ్లకు దొరికింది. మృతదేహాన్ని పోలీసులకు అప్పగించి శవపరీక్ష నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించడానికి వాహనాన్ని ఏర్పాటు చేశారు. తహసీల్దార్ జాలర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్రస్ట్ గేట్ల ముందు పెద్ద గొయ్యి ఉందని, అందులో పడితే బతకడం కష్టమని జాలర్లు తెలిపారు. అలాగే ప్రాజెక్టు వెనుక వైపు కూడా చేపల గుంతలు ఉన్నాయని, అక్కడ కూడా ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయిన సంఘటనలు ఉన్నాయని జాలర్లు వివరించారు.

అర్జున్ కుటుంబాన్ని ఆదుకుంటాం

- విద్యుత్‌శాఖ నుంచి రూ.5లక్షలు అందజేత



రూ.5లక్షల చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యేలు, ఎస్ఈ

కర్నూలు రూరల్ అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): మోదీ సభకు వస్తూ విద్యుదాఘాతంతో మృతిచెందిన అర్జున్ కుటుంబాన్ని ప్రభుత్వం తరుపున ఆదుకుంటామని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కనిగిరి ఎమ్మెల్యే ఉగ్రనరసింహరెడ్డి భరోసానిచ్చారు. శుక్రవారం మునగాలపాడులో భౌతికాయానికి నివాళి అర్పించారు. అనంతరం తల్లిదండ్రులు మద్దిలేటి, రాణెమ్మను ఓదార్చారు. విద్యుత్ శాఖ తరుపున రూ.5లక్షలను విద్యుత్ ఎస్ఈ ఆర్.ప్రదీప్‌కుమార్‌తో కలిసి అందజేశారు. మట్టి ఖర్చులకు రూ.20వేలు ఇచ్చారు. గాయలతో బయటపడిన క్షతగాత్రులను ఎమ్మెల్యేలు పరామర్శించి ప్రమాద ఘటనను అడిగితెలుసుకున్నారు. క్షతగాత్రులకు ఇద్దరికి ఎమ్మెల్యేలు రూ.10వేల చొప్పున అందజేశారు. మెరుగైన వైద్యం అందిస్తామని వారు క్షతగాత్రులకు హామీ ఇచ్చారు.

పర్యటనను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం చేసిన శ్రీశైలం క్షేత్రం, కర్నూలు పర్యటనను విజయవంతం చేసిన కూటమి నాయకులు, కార్యకర్తలకు నంద్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు ధన్యవాదాలు తెలియజేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మోదీ నాయకత్వంలో భారత్‌కు ప్రపంచంలోనే స్వర్ణయుగం నడుస్తోందన్నారు. పధాని వ్యక్తిత్వం, పాలన, దేశ సేవ, ప్రపంచ వేదికపై ఆయన స్థానం గురించి తెలిపారు.

చిట్యాలలో వైసీపీ, టీడీపీ ఘర్షణ

- దెబ్బతిన్న వాహనాలు

క్రిష్ణగిరి / పత్తికొండ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): క్రిష్ణగిరి మండలంలోని చిట్యాల గ్రామంలో శుక్రవారం వైసీపీ-టీడీపీ వర్గాల నడుమ ఘర్షణ చోటుచేసుకోవడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ ఘటనలో వైసీపీ-టీడీపీకి చెందిన ఇద్దరు నాయకులు వాహనాల అద్దాలు స్వల్పంగా ధ్వంసం అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలివీ.. మెడికల్ కాలేజీల ప్రవేటీకరణను నిరసిస్తూ వైసీపీ చేపట్టిన కోటిసంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి క్రిష్ణగిరి మండలం కోయిలకొండ, చిట్యాల, ఆలంకొండ గ్రామాలలో పర్యటించేందుకు పోలీసుల అనుమతికోరారు. అయితే చిట్లాలలో పరిస్థితులు బాగోలేవని ఆగ్రామపర్యటన రద్దుచేసుకోవాలని పోలీసులు ఆమెకు ముందస్తు హెచ్చరికలు చేశారు. అయితే కోయిలకొండలో కార్యక్రమం ముగించుకుని నేరుగా ఆమె చిట్యాలకు చేరుకోవడంతో వైసీపీ-టీడీపీ వర్గాల నడుమ వివాదం చోటు చేసుకుంది. మాటామాటాపెరగడంతో ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో వైసీపి నాయకుడు వెంకట్రామిరెడ్డికి చెందిన వాహనం, టీడీపీకి నాయకుడు చంద్ర వాహనాల అద్దాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. సీఐ మధుసూదన్ సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపుచేసి రెండువర్గాలను అక్కడి నుంచి పంపించివేశారు. కాగా ఇరువర్గాల ఘర్షణతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఘర్షణ జరిగే అవకాశం ఉందని హెచ్చరికలు చేసినా మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి పట్టించుకోకపోవడం వల్లే ఈ ఘటన చోటుచేసుకుందని పోలీసులు అంటున్నారు.



ఘటనా స్థలంలో గుమికూడిన జనం

రాజవర్దన్ మనమధ్య లేకపోవడం బాధాకరం

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు
- రాజవర్దన్‌రెడ్డికి ఘననివాళి



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

కర్నూలు రూరల్ అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో ఎంతో భవిష్యత్ కలిగి ఎదిగే సమయంలో రాజవర్దన్‌రెడ్డి మనమధ్య లేకపోవడం బాధాకరమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. కర్నూలు మండల మాజీ ఎంపీపీ దివంగత యువనాయకుడు డి.రాజవర్దన్‌రెడ్డి జయంతిని శుక్రవారం కోడుమూరు, కర్నూలు నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. నగరంలోని నెహ్రూనగర్‌లో ఉన్న విష్ణు నివాసంలో పల్లాతో పాటు, కర్నూలు జిల్లా టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎంపీ నాగరాజు, కోడుమూరు, కనిగిరి ఎమ్మెల్యేలు బొగ్గుల దస్తగిరి, ఉగ్రనరసింహరెడ్డి, కేడీసీసీబీ చైర్మన్ విష్ణువర్దన్‌రెడ్డి కలిసి రాజవర్దన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా రాజవర్దన్‌రెడ్డితో తనకు ఉన్న అనుబంధాన్ని పల్లా గుర్తు చేసుకు న్నారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న సమస్యలతో పాటు ప్రభుత్వ ఉత్తర్వులను, న్యాయపరంగా చేయాల్సిన అంశాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి అంతిమంగా ప్రజలకు మేలు చేసి వారి మన్ననలను పొందారని వివరించారు. కోడుమూరు, కర్నూలు నియోజకవర్గం నుంచి రాజవర్దన్‌రెడ్డి అభిమానులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు.

అవిశ్వాస తీర్మాన సమావేశం యథాతథం

ఆదోని రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తనపై పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని రద్దు చేయాలని హైకోర్టు మెట్లెక్కిన ఆదోని ఎంపీపీ బడాయి దానమ్మకు చుక్కెదురైంది. ఆమె వేసిన రిట్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేస్తూ, తీర్పు ఇచ్చింది. దీంతో ఉన్నత స్థాయి అధికారుల ఆదేశానుసారం ఈనెల 22వ తేదిన వైసీపీ తలపెట్టిన అవిశ్వాస తీర్మాన సమావేశం యథాతథమైంది. 2021 సెప్టెంబరు 24న బడాయి దానమ్మ(వైసీపీ) ఎంపీపీగా ఎంపికైంది. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ఆమె భర్త మాజీ ఎంపీపీ బడాయి పాంపాపతి, తదనంతరం ఆమె సైతం ఎమ్మెల్యే పార్థసారథి సమక్షంలో బీజేపీలో చేరింది. తమ పార్టీ తరపున గెలిచి, ఎంపీపీ పదవి చేపట్టి బీజేపీలో చేరుతారా అంటూ, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆగ్రహానికి గురయ్యారు. మనకు ఎంపీటీసీల బలం ఉంది. మనల్ని కాదనుకున్న వారిని తొలగించుకుందాం సిద్ధం కావాలంటూ, వైసీపీ ఎంపిటీసీలకు సాయి హుకుం జారీ చేశాడు. దీంతో 19మంది వైసీపీ ఎంపిటీసీలు సెప్టెంబరు 26వ తేదిన ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కలిసి అవిశ్వాస తీర్మానం పెట్టాలని ఫారం-3 సమర్పించారు. దీంతో సదరు సబ్ కలెక్టర్ అక్టోబరు 22వ తేదిన అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని నిర్వహించాలని సంబంధిత ఎంపీడీవో కార్యాలయ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఎంపీపీ బడాయి దానమ్మ హైకోర్టు మెట్లెక్కింది. తనను తొలగించడానికి తనపై పెట్టిన అవిశ్వాస తీర్మాణంలో ఆరుగురు ఎంపీటీసీలు ఫోర్జరీ సంతకాలు పెట్టారని, ఇది చెల్లుబాటు కాదని, వారు తలపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని రద్దు చేయాలని బడాయి దానమ్మ ఈనెల 6వ తేదిన హైకోర్టులో రిట్ పిటీషన్ వేసింది. ఎంపీపీ వేసిన రిట్ పిటీషన్‌కు సమాధానం ఇవ్వాలని హైకోర్టు కర్నూలు కలెక్టర్, ఆదోని సబ్ కలెక్టర్, డీపీఓ, డీఎల్‌పీఓ, ఎంపీడీఓలను ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు మండల కార్యాలయ అధికారులు ఈనెల 8వ తేదిన కోర్టు ఇచ్చిన నోటీసుకు ఆధారాలతో సమాధానమిచ్చింది. శుక్రవారం సాయంత్రం ఇరువర్గాల వాదనలు విన్న హైకోర్టు ఎంపీపీ వేసిన రిట్ పిటిషన్‌ను కొట్టి వేయడంతోపాటు యధావిధిగా ఈనెల 22వ తేదీన అవిశ్వాస తీర్మాన సమావేశం నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసిందని మండల పరిషత్ స్టాండింగ్ కౌన్సిల్ హైకోర్టు న్యాయవాది సుధీర్ పేర్కొన్నారు. ఈ విషయంపై సంబంధిత మండల కార్యాలయ అధికారులను వివరణ కోరగా, ఎంపీపీ వేసిన రిట్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసిన విషయం వాస్తవమేనన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

- రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు



అధికారులతో మాట్లాడుతున్న చైర్మన్

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉందని రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు అన్నారు. శుక్రవారం మత్స్యశాఖ జేడీ కార్యాలయాన్ని సందర్శించారు. బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్‌తో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం విలేకరులతో మా ట్లాడారు. ఉమ్మడి జిల్లాలో మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయం సమీపంలోనే ఉన్నా ఫిష్ ఫారంను పరిశీలించి చేపల పెంపకంపై సమాచారాన్ని సేకరించారు. కార్పొరేషన్ జిల్లా చైర్మన్ బీఎన్ నవీన్‌కుమార్ వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ టీజీ రమేష్, చిరంజీవి, ఎద్దుల వెంకటేశ్, అడ్వకేట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేట్‌పరం వద్దు

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేస్తే సహించేది లేదని, ఉద్యమాలను ఉధృతం చేస్తామని వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం శ్రీలక్ష్మి ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కర్నూలు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం కానివ్వకుండా కోటి సంతకాల సేకరణ చేపట్టామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళా వర్కింగ్ అధ్యక్షురాలు ఎస్వీ విజయమనోహరి, నగర అధ్యక్షుడు అహ్మద్ అలీఖాన్, కార్పొరేటర్లు శ్రీనివాస్, సోంపల్లి క్రిష్ణకాంత్ రెడ్డి, సత్యనారాయణమ్మ, సీనియర్ నాయకులు రాంపుల్లయ్య యాదవ్, నరసింహులు యాదవ్ తదితరులు పాల్గొన్నారు

అశాస్త్రీయంగా కాలువల నిర్మాణం



కాలువలను పరిశీలిస్తున్న సభ్యులు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): నగరంలో మురుగు కాలువల నిర్మాణం అశాస్త్రీయంగా ఉందని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పుల్లారెడ్డి అన్నారు. శుక్రవారం విఠల్ నగర్‌లోని రైల్వే లైన్ వెంట రెండేళ్ల క్రితం నిర్మించి కాలువలను పరిశీలించారు. రూ.50 లక్షలతో నిర్మించిన కాలువలో కాలనీలు, ప్రైవేటు ఆసుపత్రుల మురుగుతో దుర్వాసన వస్తుందన్నారు. కమిషనర్ తక్షణమే స్పందించి భూగర్భ కాలువను నిర్మించాలని డిమాండ్ చేశారు. డి.వెంకట్రామిరెడ్డి, సింధునాగేశ్వరరావు, కరుణాకర్, సివి.వర్మ, మహ్మద్ యూసుఫ్ పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలు ప్రారంభం



క్రీడా దుస్తులను విడుదల చేస్తున్న ప్రతినిధులు

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అవుట్‌డోర్ స్టేడియంలో దివంగత రాజావర్దన్ రెడ్డి స్మారక బాస్కెట్‌బాల్ పోటీలను విష్ణుసేన నాయకులు ఉమామహేశ్వర రెడ్డి, గౌతమ్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి ప్రారంభించారు. బాస్కెట్‌బాల్ పోటీలకు తమ సహకారం ఎప్పటికీ ఉంటుందన్నారు. అనంతరం కేక్ కట్ చేసి, క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. బాస్కెట్‌బాల్ జిల్లా కార్యదర్శి భానుప్రసాద్, దాదాబాషా పీఈటీలు ముస్తహీర్, చిన్న సుంకన్న, సబీర్, ప్రతాప్ పాల్గొన్నారు.

నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

- ప్రజారోగ్య సాంకేతిక ఈఎన్‌సీ ప్రభాకర్‌రావు



భవనాన్ని పరిశీలిస్తున్న ఈఎన్‌సీ ప్రభాకర్‌రావు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని, తనిఖీ చేసిన అనంతరమే అధికారులు బిల్లులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రజారోగ్య సాంకేతిక ఇంజనీర్ ఇన్ చీఫ్ ప్రభాకర్‌రావు ఆదేశించారు. శుక్రవారం నగర పాలక సంస్థ నూతన భవనం, సుంకేసుల జలాశయం, ఎస్ఎస్ ట్యాంకు, పైపులైన్ పనులను పరిశీలించారు. పనుల జాప్యానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్‌రెడ్డి, డీఈఈ గిరిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

అహ్మద్ ఖాన్ సేవలు అభినందనీయం



నివాళి అర్పిస్తున్న వీసీ

కర్నూలు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సయ్యద్ అహ్మద్ ఖాన్ ఉర్దూ విభాగానికి చేసిన సేవలు అభినందనీయమని వీసీ ప్రొఫెసర్ షేక్ షావలీ అన్నారు. శుక్రవారం ఉర్దూ యూనివర్సిటీలో సర్ సయ్యద్ జయంతి నిర్వహించారు. నైతిక విలువలు, విద్యా దృష్టి వివరాలను తెలిపారు. రిజిస్ట్రార్ వి. లోకనాథ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్ మహబూబ్ బాషా, అమీన్‌బేగం, జే. మహమ్మద్ షఫి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి తీవ్ర నష్టం

కర్నూలు ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడితే పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ తెలిపారు. పీఏపీఈటీ ఆధ్వర్యంలో శుక్రవారం బి.క్యాంపు ఒకేషనల్ జూనియర్ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో మట్టి, నీరు, గాలి, భూగర్భజలాల కలుషితం అవుతాయన్నారు. ప్లాస్టిక్‌ను కాలిస్తే వాయు కాలుష్యంతో మనుషులకు శ్వాసకోస వ్యాధులు వస్తాయన్నారు. అధ్యాపకులు రామకృష్ణ, విజయశేఖర్, మల్లికార్జున, సోమేష్, శ్రీధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాలీలు, వీల్‌చైర్లు విరాళం..



రోగులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రాజావర్దన్ జయంతి వేడుకలు నిర్వహించారు. శుక్రవారం ఎమ్మెల్యే దస్తగిరి సూపరింటెండెంట్‌కు నాలుగు ట్రాలీలు, వీల్ చైర్‌ను విరాళంగా అందించారు. అనంతరం రోగులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సూపరింటెండెట్ డా.కే.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా రోగులకు తోడ్పాటు అందించేందుకు విష్ణు సేన చేస్తున్న సేవలను కొనియాడారు. ఎమ్మెల్యే విరాళంగా ఇచ్చిన ట్రాలీ, వీల్ చైర్లను రోగులకు వినియోగిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సీఎస్ఆర్ఎంవో డా.వెంకటరమణ, హాస్పిటల్ హెచ్‌డీఎస్ సభ్యులు రామాంజనేయులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో దేశ సేవకు అవకాశం

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణ ఉంటే దేశ సేవ చేసే అవకాశం ఉంటుందని ఎన్‌సీసీ 9ఏ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ జోష్ఫే ఫిలిప్ పేర్కొన్నారు. శుక్రవారం క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో రిజిస్ట్రార్ డా.జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ బాలికలకు ఎన్‌సీసీ ఎంపికలు నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డా.బీఆర్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థులకు ఉన్నత విద్యలో, డీఎస్సీలో కూడా అవకాశాలు లభించాయని తెలిపారు. బెటాలియన్ బాలికల ఆఫీసర్ డా.అనూష ఎన్‌సీసీ ఆఫీసర్స్ అఫ్జైనా, విజయ వెంకట్, ఎస్ఎస్ రెడ్డి పాల్గొన్నారు.

వేరుశనగ రైతు బెంగ

- కనీస మద్దతుధర రూ.7,263 కాగా, వ్యాపారులు ఇచ్చిన ధర రూ.5,909
- క్వింటానికి రూ.1,354 నష్టపోతున్న రైతులు
- పట్టించుకోని మార్కెట్ కమిటీ



కర్నూలు మార్కెట్‌కు వచ్చిన వేరుశనగ దిగుబడులు

కర్నూలు అగ్రికల్చర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగు చేసిన వేరుశనగకు మద్దతు ధర అందకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు మార్కెట్ యార్డుకు ఉమ్మడి జిల్లాలోని డోన్, పత్తికొండ, పాణ్యం, ఎమ్మిగనూరు, ఆలూరు, తదితర ప్రాంతాల రైతులు శుక్రవారానికి 1215 క్వింటాళ్లను అమ్మకానికి తెచ్చారు.

వ్యాపారుల సిండికేట్

మార్కెట్‌కు వేరుశనగ రావడంతో వ్యాపారులు సిండికేట్ అయ్యారు. గరిష్ట రూ.5,909లు, మధ్యస్థ ధర రూ.5,459లు, కనిష్ఠ ధర రూ.5,829లు మాత్రమే ధర పలకడంతో రైతులు ఆగ్రహావేశాలకు గురయ్యారు. కేంద్ర ప్రభుత్వం క్వింటానికి రూ.7,263ను మద్దతు ధరగా నిర్ణయించగా ఇక్కడ మాత్రం దాదాపు రూ.1354లు తగ్గించడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ కమిటీ అధికారులు కార్యాలయానికే పరిమితం అవుతూ తమను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రస్తుత ధర ప్రకారం విక్రయిస్తే తవ్రంగా నష్టపోయి అప్పులపాలు అవుతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, మద్దరు ధర వచ్చేలా చూడాలని కోరుతున్నారు

రీ సర్వే వేగంగా చేయాలి

సి.బెళగల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో రీ సర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి, అర్జీలపై ఇంటికి వెళ్లి విచారణ చేయాలన్నారు. రిపోర్టును ఉన్నతాదికారులకు పంపాలన్నారు. సర్వేయర్ నాగభూషణం, రీసర్వే డీటీ వెంకటేశ్వర్లు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలి

కోడుమూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వసతి గృహ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలని ఎంపీడీవో రాముడు ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి, సమస్యలను వార్డెన్ ధనుంజయను అడిగి తెలుసుకున్నారు. ఆదేశించారు.

ఆడబిడ్డ కుటుంబానికి ఆణిముత్యం

- డీఐవో, నోడల్ అధికారి డా.ఉమా



మాట్లాడుతున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా.ఉమా

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డ కుటుంబానికి ఆణిముత్యమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, పీసీపీఎన్‌డీటీటీ నోడల్ ఆఫీసర్ డా.ఉమ అన్నారు. నగరంలోని బుధవారపేట మెడీరియన్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో అంతర్జాతీయ బాలిక వారోత్సవాల సదస్సు నిర్వహించారు. కుటుంబ సభ్యులు ఆడపిల్లల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని, ఆడపిల్లల శాతం తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తుందని వారిని కాపాడే బాధ్యత అందరిపై ఉందన్నారు. డెమో ఎస్.ప్రకాష్‌రాజ్ మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులు సమానమని, లింగ వివక్ష చూపకూడదన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారికి చేయించుకున్న వారికి ప్రోత్సహించిన వారికి చట్టరీత్యా జైలు శిక్ష, జరిమానాలు ఉంటాయని హెచ్చరించారు. డిప్యూటీ డెమో బాబా ఫక్రుద్దీన్, మెడికల్ ఆఫీసర్ డా.మాధవి, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి, లీగల్ కన్సల్టెంట్ సుమలత, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

రాజవర్ధన్‌రెడ్డి సేవలు మరువలేనివి

- నివాళి అర్పించిన నాయకులు



గార్గేయపురం ప్రేమగిరిలో కేకు కట్ చేస్తున్న అభిలాష్



సి.బెళగల్‌లో నాయకుల నివాళులు..

కర్నూలు రూరల్ అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీపీ దివంగత రాజవర్దన్‌రెడ్డి సేవలు మరులేనివని నందనపల్లె టీడీపీ ఇన్‌చార్జి అభిలాష్ అన్నారు. శుక్రవారం గార్గేయపురం శివారులోని ప్రేమగిరి ఆశ్రమంలో మాజీ ఎంపీపీ రాజవర్దన్ రెడ్డి జయంతి నిర్వహించారు. అనాథపిల్లలతో కలిసి భారీ కేక్‌ను కట్ చేశారు. టీడీపీ నాయకులు ఏసురత్నం, భాస్కర్, ఖాజా, అలీ,హనుమంతు, విష్ణుసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజవర్ధన్ రెడ్డి ఆశయాలు కొనసాగిద్దాం

గూడూరు: దివంగత డి.రాజవర్ధన్ రెడ్డి ఆశయాలు కొనసాగిద్దామని టీడీపీ నాయకుడు రామాంజనేయులు సూచించారు. శుక్రవారం పాత బస్టాండ్ వద్ద రాజవర్ధన్ రెడ్డి జయంతి నిర్వహించారు. సృజన్, రేమట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

● కౌన్సిలర్ రేమట సురేష్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు నివాళి అర్పించారు. తెలుగు శ్రీనివాసులు, పౌలు, మన్సూర్ బాషా, పరుశురాముడు, చికెన్ వాహిద్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

కోడుమూరు: పట్టణంలోని జలవనరుల కార్యాలయం ఆవరణలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంగాధర్ నాయుడు ఆధ్వర్యంలో దివంగత రాజవర్ధన్‌రెడ్డి జయంతి నిర్వహించారు. చిత్రపటానికి నివాళి అర్పించి, కేక్ కట్ చేశారు. మహిళలకు చీరలు పంపిణీ, అన్నదానం నిర్వహించారు. రామకృష్ణారెడ్డి, బడెసాగౌడ్; విజయ్, గోరంట్ల మధు, అయ్యప్ప పాల్గొన్నారు.

సి.బెళగల్: స్థానిక ఎన్టీఆర్ పార్కులో టీడీపీ కన్వీనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో దివంగత రాజవర్ధన్‌రెడ్డి జయంతి నిర్వహించారు. ఎంపీపీగా ఆయన సేవలు మరువురానివన్నారు. అనంతరం పీహెచ్‌సీలో రోగులకు పాలు, బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేశారు. తిమ్మప్ప, బీమన్న, బాలజీవెంకటేశ్, రామకృష్ణ. ధనుజయుడు ఉన్నారు.

'మోదీ సభకు రూ.కోట్లు వృథా'

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ భజన కోసం రూ.కోట్లు ప్రజాధనం తగలేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ విమర్శించారు. శుక్రవారం మాట్లాడుతూ మోదీ సభతో రాష్ట్ర ప్రగతికి ఎలాంటి ఉపయోగం లేదన్నారు. చంద్రబాబు 25 సార్లు మోదీభజన చేయగా, తండ్రిని మించిన తనయుడు లోకేష్ 35 సార్లు మోదీ జపం చేశారని ఎద్దేవా చేశారు. మోదీ ఉపన్యాసం అంతా పవర్ జనరేషన్, ఏఐ గూగుల్ గురించి తప్ప, వెనుకబడిన రాయలసీమ అభివృద్ధి ప్రస్తావన లేదన్నారు. మోదీ పర్యటన పేరుతో వారం పాటు జిల్లా పరిపాలన మొత్తం స్తంభించిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు పీఎస్.రాధాక్రిష్ణ, జి.రామక్రిష్ణ, ఎండి.ఆనంద్‌బాబు, టి.రాముడు, ఎండి. అంజిబాబు పాల్గొన్నారు.

● మోదీ జిల్లా పర్యటన వల్ల రాయలసీమకు ప్రయోజనం చేకూరలేదని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఆరోపించారు. శుక్రవారం మాట్లాడుతూ ప్రత్యేక హోదా, విభజన హామీల ఊసే లేదన్నారు. ఎస్.మునెప్ప, ఎన్.లెనిన్‌బాబులు పాల్గొన్నారు.

ప్రధాని సభ విజయవంతం

కల్లూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ సభ విజయవంతమైందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డితో కలిసి పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి ఇంటికి వెళ్లారు. నందికొట్కూరు ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, గౌరు చరిత దంపతులతో కలిసి హర్షం వ్యక్తం చేశారు. డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, టీడీపీ బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి కాసాని మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గౌరు నివాసంలో నాయకులు

బీజేపీ సిద్ధాంతాలు ప్రమాదకరం

కల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సిద్ధాంతాలు దేశ భవిష్యత్తుకు అత్యంత ప్రమాదకరమని ఏఐసీసీ సభ్యుడు, నంద్యాల జిల్లా డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీ నరసింహాయాదవ్ ఆరోపించారు. శుక్రవారం నగరంలోని దామోదరం సంజీవయ్య కాంగ్రెస్ భవన్‌లో బేతంచెర్లకు చెందిన యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీపై దేశ వ్యాప్తంగా రోజురోజుకు ఆదరణ పెరుగోతందన్నారు. అనంతరం పార్టీలో చేరిన షాషావలి, ముస్తాక్, మొహిద్దీన్, రహీంలకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు గార్లపాటి మద్దులేటి స్వామి, జనార్ధన్ పాల్గొన్నారు.



పార్టీలో చేరినవారితో లక్ష్మీనరసింహ యాదవ్

తొగటవీర క్షత్రియ సంఘం నూతన కమిటీ

కల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తొగటవీర క్షత్రియ సేవాసంఘం నూతన కమిటీని రిజిస్ట్రేషన్ చేశామని సంఘం జిల్లా అధ్యక్షుడు మాదం.గంగాధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19న కల్లూరు సీతారాముల ఆలయంలో పోలిశెట్టి రాజ్‌కుమార్, సతీష్ సమక్షంలో భవిష్యత్ కార్యచరణపై సమావేశం ఉంటుందన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాల క్రీడా ప్రాంగణంలో యువ నాయకుడు గౌతమ్ రెడ్డి ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు ఎమ్మెల్యే దస్తగిరి, ఉమామహేశ్వరరెడ్డి, గౌతమ్ రెడ్డి పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముంద రాజావర్దన్ రెడ్డి జయంతి నిర్వహించారు.

సభ విజయవంతం

ఓర్వకల్లు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ సభ విజయవంతం కావడం పట్ల టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఓర్వకల్లులో ఆ పార్టీ కన్వీనర్ గోవిందరెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి మాట్లాడుతూ పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ఆధ్వర్యంలో పొదుపు మహిళలు, కూటమి నాయకులు తరలివెళ్లార న్నారు.

గోల్డెన్ అవర్ కీలకం

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల కేసులో గోల్డెన్ అవర్ కీలకమని మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి తెలిపా రు. వరల్డ్ ట్రామ డే సందర్భంగా హాస్పిటల్‌లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమర్జెన్సీ మెడిసిన్ స్పెషలిస్టు డా.విశ్వకుమార్, న్యూరోసర్జన్ డా.మంజునాథ్, ఆర్థో సర్జన్, డా.రఘునందిని వైద్యులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి ఊతం



ప్రధాని, సీఎంకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే

కల్లూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పట్టుదల, పీఎం మోదీ కృషితో రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి ఊతం వచ్చిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. గురువారం ఓర్వకల్లు విమానాశ్ర యంలో మోదీ, చంద్రబాబు, లోకేష్‌కు ఎమ్మెల్యే ఘనస్వాగతం పలికారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఏపీలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు.

మోదీ సభ సక్సెస్



ఎయిర్‌పోర్టులో మోదీకి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే

కర్నూలు రూరల్ అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో నిర్వహించిన ప్రధాన మంత్రి నరేంద్రమోడీ సభ విజయంతమైందని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి శుక్రవారం పేర్కొన్నారు. కోడుమూరు నుంచి తరలివచ్చిన ప్రజలకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. పారిశ్రామిక కారిడార్‌తో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని తెలిపారు. కేడీసీసీబీ చైర్మెన్ విష్ణువర్దన్‌రెడ్డి సమష్టి జనం తరలింపులో శ్రద్ధ తీసుకున్నారన్నారు.

లే అవుట్లను 23లోపు క్రమబద్ధీకరించుకోవాలి

- కమిషనర్ విశ్వనాథ్



మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలో అనధికార లే అవుట్లను ఈ నెల 23లోపు క్రమబద్ధీకరించుకోవాలని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ కోరారు. శుక్రవారం ఎస్‌బీఐ కాలనీలోని సమావేశ భవనంలో ఓపెన్ ఫోరం నిర్వహించారు. అనధికారల లే అవుట్ల క్రమబద్ధీకరణ పథకాని రెండు విడతల్లో 1,180 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇంకా చేయనివారి వెంటనే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డీసీపీ వెంకటరమణ, టీపీవో అంజాద్ బాషా, సూపరింటెండెంట్ సుబ్బన్న, ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

జీఎస్టీ పేరుతో ఆర్భాటం

కర్నూలు అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలపై ఎనిమిదేళ్లుగా జీఎస్టీ పేరుతో పన్నుల భారం మోపి, ఇప్పుడు తగ్గించామని ఆర్భాటం చేయడం ఎందుకని మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యుడు ఎం.సుధాకర్ బాబు ప్రశ్నించారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ ఇది కేవలం రాజకీయ సభలా కనిపించిందన్నారు. అధికార యంత్రాంగం పాలను గాలికి వదలి పెట్టి నాయకుల భజన చేయడం మంచి సంప్రదాయం కాదన్నారు. విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించి, వాటి బస్సులను సభకు జనాన్ని తరలించడానికి వాడుకోవడం అంటే విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. యూత్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేంద్ర నాయుడు, జిలానీ బాషా, దామోదరం రాధాకృష్ణ, బి.బతుకన్న, బజారన్న పాల్గొన్నారు.

ముగిసిన చదరంగం పోటీలు



క్రీడాకారులతో అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో రాజావర్దన్ రెడ్డి మెమోరియల్ చదరంగం పోటీలు శుక్రవారం ముగిసాయి. రాజావర్దన్ రెడ్డి జయంతి సందర్భంగా పోటీలు నిర్వహించినట్లు ఆర్గనైజింగ్ చైర్మన్ విష్ణువర్దన్ రెడ్డి తెలిపారు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, మాజీ ఎమ్మెల్యే గఫూర్, కేవీసుబ్బారెడ్డి, కార్పొరేటర్ పద్మలతారెడ్డి, నాగేశ్వరరావు యాదవ్, చంద్రశేఖర్ బహుమతులు ప్రదానం చేశారు

ప్రాజెక్టుల ఊసెత్తకపోవడం బాధాకరం



రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

కోడుమూరు రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు వచ్చిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు సాగునీటి ప్రాజెక్టుల ఊసెత్తకపోవడం బాధాకరమని సీపీఎం నాయకుడు రాజు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ప్యాలకుర్తి గ్రామంలో రైతులను కలిశారు. వెనకబడ్డ కర్నూలు జిల్లాలో గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ప్రకటించకపో వడం పట్ల రైతులపై వారి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో తెలుస్తోందన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై విధించిన పన్నులను వ్యతిరేకించాలని రైతులకు పిలుపునిచ్చారు. పత్తి, పాడి, రొయ్యలు, కోళ్ల పరిశ్రమ దెబ్బతింటుందని తెలిపారు. రాజు, గఫూర్‌మియా, ఎర్రమద్దిలేటి, లక్ష్మన్న పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న న్యాయవాదులు

కర్నూలు లీగల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు కర్నూలులో హైకోర్టు బెంచ్ విషయమై హామీ ఇచ్చినందుకు టీడీపీ లీగల్ సెల్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం బార్ అసోసియేషన్ ఆవరణలో ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ జి.నాగముణి ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు గురించి సీఎం మరొకసారి ప్రధాని మోదీ సమక్షంలో బహిరంగంగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారన్నారు. మోహన్‌బాబు, ధనారెడ్డి, శివకుమార్ గుప్త, జహంగీర్ బాషా, నరసింహులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్న పెండేకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఫార్మేటివ్ అసెస్మెంట్-2 పరీక్షలను శుక్రవారం డిప్యూటీ ఈవో వెంకరమణా రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యయుడు షేకన్న, ఉపాధ్యాయులు భాస్కర్, శ్రీనివాసులు, వాసవి పాల్గొన్నారు.

వైద్యసేవలు సక్రమంగా అందాలి

పత్తికొండ టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వైద్యసేవలు ప్రజలకు సక్రమంగా అందేలా చూడాలని రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు సూచించారు. పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రిలో డెంగీ కేసులు, మలేరియా కేసులపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ జ్వరం వచ్చిన ప్రతి వ్యక్తికి టెస్టులు చేయాలన్నారు. మలేరియా జిల్లాధికారి నూకరాజు, మెడికల్ ఆఫీసర్లు కల్పన, హారిక, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రధాని సభ విజయవంతంతో జోష్



పత్తికొండ, అక్టోబరు 17, (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ కర్నూలు పర్యటన విజయవంతంచేసిన కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నానని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. ఏపికి కేంద్రంనుండి అన్నిరకాల సహాయసహకారాలు అందిస్తామని ప్రదాని వెల్లడించండం రానున్న తరాల ఉజ్వలభవిష్యత్‌కు భరోసాఅని అభిప్రాయపడ్డారు.



ఆలూరు: దేశ ప్రధాని నరేంద్రమోదీ కర్నూలు సభ సక్సెస్‌తో కూటమి నేతల్లో నూతన ఉత్సాహం నెలకొందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ జీఎస్టీ కర్నూలు సభను విజయవంతం చేసిన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలకు సహకరించిన అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఆదోని టౌన్ : దేశాధినేత నరేంద్ర మోదీ కర్నూల్ జిల్లా పర్యటనలో జిల్లాలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్న నమ్మకం ప్రజలలో



ఏర్పడిందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ అన్నారు. యువమోర్చ మాజీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస ఆచారి మాట్లాడుతూ, కర్నూల్‌లో మోడీ పర్యటన పట్ల జిల్లా ప్రజలు తమ హర్షాన్ని వ్యక్తం చేస్తున్నారని అన్నారు.



పత్తికొండ టౌన్: వెనకబడిన రాయలసీమ ప్రాంతం అభివృద్ధి కావాలంటే ప్రధానమంత్రి నరేంద్రమోదీతోనే సాధ్యమని పత్తికొండ బీజేపీ అసెంబ్లీ కో కన్వీనర్ గోవర్ధన్ నాయుడు పేర్కొన్నారు. ఏదేమైనా రాయలసీమ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే కేంద్రంలో మోదీ, సీఎం చంద్రబాబునాయుడితోనే సాధ్యమన్నారు.



తుగ్గలి: దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఉమ్మడి జిల్లా పర్యటనను పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో దిగ్విజయం చేశామనీ టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర అన్నారు. బహిరంగ సభకు తుగ్గలి మండలం నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పిలుపుతో వేలాది మంది సభకు తరలివెళ్లడం ఎంతో సంతోషమని, స్వచ్ఛందంగా ఈ సభకు రావడంతో ఎంతో ఆనందదాయకమన్నారు. కేంద్ర ప్రభుత్వం పేదల అభివృద్ధి కోసం జీఎస్టీ తగ్గింపు ఎంతో హర్షించదగ్గ విషయమన్నారు.

పేదలకు వైద్య విద్య దూరం : ఎమ్మెల్యే విరూపాక్షి



సంతకాలు చేస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

దేవనకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలపై ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో పేదలకు వైద్యవిద్య దూరమైతుందని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అన్నారు. శుక్రవారం దేవనకొండలో కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రైవేట్ వ్యక్తుల చేతులోకి వైద్యవిద్య వెళ్తే ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. కన్వీనర్ రామకృష్ణ, దివాకర్‌నాయుడు, కందనాతి రంగన్న, కబీర్, వెంకటాపురం రామాంజినేయులు, జొన్నల అంజీ, తదితరులు ఉన్నారు.

దాడికి నిరసనగా ధర్నా

ఆస్పరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీ.ఆర్.గవాయిపై జరిగిన దాడికి నిరసనగా శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పులి కరుణాకర్, బీటెక్ వీరభద్ర, ఎల్లప్ప, నరసప్ప, నాగరాజు, మహానంది, నాగేష్, నాగరాజు, పరశురాం, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆదోని అగ్రికల్చర్ : సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిపై దాడి చేసిన నిందితుడి పై రాజద్రోహం కేసు నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దమ్ముపాటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. దత్తు, చిన్నా , మనోజ్ , గిడ్డయ్య, బాలన్న. బీమా, మాదాసు జగన్, బాలస్వామి, నరసింహులు, శాంతరాజు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన వైకుంఠం జ్యోతి



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావును సన్మానిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి

ఆలూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావును జిల్లా టీడీపీ కార్యాలయంలో శుక్రవారం టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డితో కలిసి ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేసి స్థానిక సంస్థలకు క్యాడర్‌ను సన్నద్ధం చేయాలని సూచించినట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట మండల కన్వీనర్ అశోక్‌యాదవ్, నాయకులు రహమాన్, రాముయాదవ్ పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

హొళగుంద, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో నూతన ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులకు ఎస్‌టీయూ ఆధ్వర్యంలో సేవ పుస్తకాలు పంపిణీ చేసినట్లు ఆ సంఘం నాయకులు బీటీ ఖలందర్, జి దొడ్డభసప్ప, శుక్రవారం తెలిపారు. ఉపాధ్యాయులు తిప్పేస్వామి పాల్గొన్నారు.

పైపులైన్ మారుస్తాం

మద్దికెర, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పందుల కుంట సమీపాన ప్రజలకు తాగునీరు అందించే పైపులైన్ మురుగు కాలువలో తీసేసి మారుస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్ తెలిపారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో డ్రైనేజీలో తాగునీటి పైపులైన్ అనే వార్తకు స్పందించిన అధికారులు డ్రైనేజీ పైపులైన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్ల కిందట అప్పటి అధికారులు స్థల ప్రభావం వల్ల పైపులైన్ వేయడం జరిగిందని, దాన్ని వెంటనే మార్చేసి డ్రైనేజీ కాలువలో కాకుండా పక్కన వేస్తామన్నారు.

25లోగా పంట నమోదు చేసుకోవాలి

దేవనకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు 25లోగా పంట నమోదు చేసుకొవాలని ఏడీఏ మోహన్‌విజయ్‌కుమార్, ఏవో ఉషారాణి తెలిపారు. గ్రామాలలోని రైతుసేవా కేంద్రాలలో వ్యవసాయ అధికారులకు తాముసాగు చేసిన పంట వివరాలు తెలిపితే పొలం వద్దకు వచ్చి పంటనమోదు చేయడం జరుతుందన్నారు. సీసీఐ ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి పత్తి కొనుగోలు ప్రారంభించడం జరుగుతుందని, జిల్లాలో ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు, నాగలాపురం, మంత్రాలయం ఐదు కేంద్రాలలో పత్తి కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. పత్తి తేమశాతం గింజ 8 శాతం (చిన్నగింజ) ఉంటే రూ.7800 , గింజ (మధ్యస్తం) పదిశాతం రూ.8060, 12 శాతం ఉంటే(మొదటిరకం) 8,110 ధరతో కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. మండలంలో నష్టపోయిన ఉల్లిరైతుల వివరాలను సేకరించాల వీఏఏ లకు సుచించారు.

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

ఆస్పరి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన ఆస్పరి ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ బాలికా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యవేక్షకులు సునీత, పద్మావతి మాట్లాడుతూ భారతదేశంలో పాఠశాలలు, కళాశాలలు, స్వచ్ఛంద సంస్థలు, బాలికల విద్య, ఆరోగ్యం, భద్రతపై సదస్సులు నిర్వహించాయి. బాల్యవివాహాల నిర్మూలన, ఆత్మరక్షణ శిక్షణ, మానసిక ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఆదోని టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో రజక సమాజానికి చెందిన అభ్యర్థులు ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం ఎంతో అభినందనీయమని ఆదోని తాలూకా రజక ఉద్యోగుల సంఘం నాయకులు నాగరాజు అన్నారు. శుక్రవారం మరాఠిగేరిలోని రజక విశ్రాంతి భవనంలో గోవిందప్ప అధ్యక్షతను సమావేశం జరిగింది. సాయిబాబా మాట్లాడుతూ, విద్యాభ్యాసంతోనే కుటుంబ అభివృద్ధికి అవకాశం ఉంటుందన్నారు.

పేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

ఆదోని టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా శుక్రవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 8 మంది పేద మహిళలకు లయన్స్ క్లబ్ సభ్యులు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ మరో జిల్లా ఛైర్మన్ ప్రసాదరావు, అధ్యక్షుడు ధర్మారెడ్డి, కోశాధికారి వన్నప్ప రాజు, ఆర్‌ఎస్‌ఎస్ సభ్యుడు మంతా రమేష్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

దేవనకొండ, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : పేదలుకు ప్రభుత్వం ఇచ్చే రుణాలకు సద్వినియోగం చేసుకొవాలని టీడీపీ మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్‌గౌడ్, ఏపీఎం లక్ష్మమ్మ అన్నారు

పాఠశాలకు పూర్వ విద్యార్థుల చేయూత

ఆదోని అగ్రికల్చర్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిన్న పెండేకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న హిందీ ఉపాధ్యాయురాలు వాసవి ఆమె విద్యాబుద్దులు నేర్పిన విద్యార్థులు శుక్రవారం పాఠశాలకు రూ. 82 వేలు విలువచేసే పర్నిచర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేకన్న మాట్లాడుతూ విద్యాబుద్దులు నేర్పిన గురువుని మర్చిపోకుండా విద్య యజ్ఞ టీం ఏర్పాటు చేసుకొని పాఠశాలకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు భాస్కర్, శ్రీనివాసులు, శిరీష, హనుమన్న పాల్గొన్నారు.

విద్య ప్రతి ఒక్కరికీ వరం: ఎంఈవో

ఆలూరు రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): విద్య ప్రతిఒక్కరికీ గొప్పవరం లాంటిదని ఎంఈఓ-2 చిరంజీవిరెడ్డి అన్నారు. శుక్రవారం మరకట్టు గ్రామంలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు శివనాగన్న, శ్రీనివాసులు, హరినాథ్‌లను గ్రామపెద్దలు, గ్రామస్తులు శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ గ్రామాల్లో తల్లిదండ్రులు పిల్లలను పొలం పనులకు పంపకుండా వారిని బడికి పంపి బంగారు భవిష్యత్ బాటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బురిజింటి ఎల్లప్ప, పాలాక్షిరెడ్డి, మాజీ సర్పంచ్ జంగాలి ఎల్లప్ప, ఎంపీటీసీ ఉచ్చీరప్ప, ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు బి.నాగరాజు, పంచాయతీ కార్యదర్శి లోకేష్, టీడీపీ నాయకులు వెంకటేష్, ఉచ్చీరప్ప, రిటైర్డ్ హెచ్‌ఎం గోవిందప్ప, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇది రైతు ప్రభుత్వం

తుగ్గలి, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రైతులకు చిన్న కష్టం వచ్చినా.. ఆ కష్టాన్ని వెంటనే పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ తెలుగు రైతు తాలుకా అధ్యక్షుడు బాలన్న, విద్యాకమిటి ఛైర్మన్ మిద్దె రవికుమార్, తెలుగు యువత నాయకులు మిద్దె వెంకటేశ్ యాదవ్ అన్నారు. ఇప్పటి వరకు దేశంలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ముఖ్యమంత్రుల్లో చంద్రబాబునాయుడు ప్రజల గుండెల్లో నిలిచారన్నారు.

జామిన్‌దారుడి షాపునకు తాళాలు

పత్తికొండ టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తమ ఫైనాన్స్‌లో తీసుకున్న రుణం కంతుల వారీగా చెల్లించలేదంటూ రుణం తీసుకున్న వ్యక్తిపై వసూలు చేయని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ జామిన్‌దారుడి షాపుకు తాళాలు వేసి బాధితుడిని రోడ్డున పడేసిన సంఘటన శుక్రవారం పత్తికొండ పట్టణంలో జరిగింది. వివరాల మేరకు.... పత్తికొండ పట్టణానికి చెందిన మంగలి రామాంజనేయులు స్థానిక గుండప్ప హోటల్‌కు ఎదురుగా బంకు వేసుకుని టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పట్టణానికి చెందిన ఖాజాహుసేన్ అనే మిత్రుడు గతేడాది శ్రీరామ్ ఫైనాన్స్‌లో రూ.2 లక్షలు దాకా లోను తీసుకున్నారు. ఈ సందర్భంగా జామిన్‌గా మంగలి రామాంజనేయులు సంతకం చేశాడు. అయితే కొన్నేళ్ల పాటు ఖాజాహుసేన్ ఫైనాన్స్‌లో తీసుకున్న రుణాన్ని సక్రమంగా చెల్లించినప్పటికీ కొన్ని కారణాల రీత్యా మిగిలిన మొత్తం రూ.90 వేలు చెల్లించలేదు. దీంతో రుణం తీసుకున్న ఖాజాహుసేన్‌పై డబ్బులు వసూలు చేయలేని ఫైనాన్స్ నిర్వాహకులు జామిన్ ఇచ్చిన మంగలి రామాంజనేయులపై కక్ష సాధింపుతో ఈనెల 16వ తేదీన (గురువారం) తన షాపుకు తాళాలు వేసుకుని ఫైనాన్స్ నిర్వాహకులు వెళ్లారు. జామిన్ వ్యక్తిపై ఇలా భయభ్రాంతులకు గురిచేసేలా షాపుకు తాళాలు వేయడం ఏమిటని పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి ఫైనాన్స్ కంపెనీలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని బాధితుడికి న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

బాణసంచా దుకాణదారులు జాగ్రత్తలు తీసుకోవాలి: మున్సిపల్ కమిషనర్


దుకాణదారులతో మాట్లాడుతున్న కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బాణసంచా దుకాణదారులు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం దుకాణ యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. పట్టణంలోని దీపావళికి వీవర్స్ కాలనీ మైదానంలో దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్న వారికి మున్సిపల్ కమిషనర్ పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్డీవో, పోలీస్ స్టేషన్, ఫైర్ స్టేషన్, తహసీల్దార్‌ల నుంచి నిరభ్యంతర సర్టిఫికెట్ తీసుకున్న తరువాత దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆదివారం దుకాణాలు ఏర్పాటు చేసుకొని మంగళవారానికి దుకాణాలు తీసేయాలని తెలిపారు.

టీడీపీ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నందవరం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు నాగరాజుగౌడును శుక్రవారం నందవరంలో మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చెన్నకేశవరెడ్డి మనవడు రాజీవ్‌రెడ్డిని పరిచయం చేశారు. అలాగే రెహమాన్ తాత కుమారుడు తాహేర్‌బాషా రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది ఇటీవల ఇంటికి రావడంతో కలిసి పరామర్శించారు. రైతు సంఘం నాయకులు గడ్డం నారాయణరెడ్డి, జడ్పీటీసీ నిఖిల్‌చక్రవర్తి, పల్లె రాఘవరెడ్డి, సర్పంచ్ శివన్న, శంకర్‌రెడ్డి, చుక్క మల్లేశ్, లింగమూర్తి, బుక్కిట్ల బసవగౌడు తదితరులు ఉన్నారు.

జీవ ఎరువుల వాడకంపై అవగాహన

ఎమ్మిగనూరు రూరల్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో జీవ ఎరువుల వాడకంపై రైతులకు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి అవగాహన కల్పించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జీవ ఎరువుల వినియోగంతో రసాయన ఎరువులపై ఆధారపడకుండానే పంటల ఉత్పత్తిని పెంచుకోవచ్చని తెలిపారు. కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

సభ విజయవంతమైంది

● నాయకుల కృతజ్ఞతలు


ఎమ్మిగనూరులో మాట్లాడుతున్న నాయకులు

ఎమ్మిగనూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కర్నూలులో జరిగిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ , విద్యాశాఖమంత్రి నారా లోకేష్ సభకు ఎమ్మిగనూరు మండలం నుంచి పెద్దఎత్తున హాజరైన ప్రజలకు కూటమి పార్టీల నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలని మండల టీడీపీ నాయకులు వెంకటేష్, సురేష్ చౌదరి, డీలర్ ఈరన్న, రాఘవేంద్ర, రఘు, భీమరాయుడులు అన్నారు. శుక్రవారం వారు టీడీపీ కార్యలయంలో ఏర్పటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఆద్వర్యంలో ఎమ్మిగనూరు మండలంలోని ప్రతి గ్రామం నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున తరలివెళ్లం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు చూపిన ఆదరాభిమానాలకు ధన్యవాదాలన్నారు. నాగరాజు పాల్గొన్నారు.


నందవరంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నందవరం: మోదీ సభను విజయవంతం చేసిన వారందరికీ ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నట్లు టీడీపీ నాయకులు డిపీ రాముడు, మండల కన్వీనర్ కాశీంవలీ, రైస్‌మిల్ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఇంటింటికి బస్సులో స్వతాహగా కార్యకర్తలు ఎక్కి వెళ్లి విజయవంతం చేసిన వారికి ధన్యావాదాలు తెలిపారు. యువత కూడా బహిరంగ సభకు వచ్చారని అన్నారు. కార్యక్రమంలో సత్యారెడ్డి, ఉదయ్‌గౌడు, రాగప్ప పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు

● ఎమ్మెల్యే బీవీ



ఎమ్మిగనూరు: ఎన్డీఏ ప్రభుత్వం ఆధర్యంలో కర్నూలులో నిర్వహించిన సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ సభ కూటమి నాయకులు, కార్యకర్తలు, జిల్లా ప్రజల సహకారంతో విజవంతమైందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు పాల్గొన్న సభకు ఎమ్మిగనూరు నుంచి వేలాదిగా తరలివ చ్చి విజయ వంతం చేసిన కూటమి పార్టీల నాయకులకు, కార్యకర్తలకు, మహిళలకు, పార్టీ అభిమానులకు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. నియోజవర్గ ప్రజల అధరాభిమానాలు కూటమి ప్రభుత్వంపై ఎల్లప్పుడు ఉండాలని ఆకాంక్షించారు.

పల్లా శ్రీనివాసరావుకు ఇరువర్గాల పోటాపోటీ సన్మానాలు


శ్రీనివాసరావుకు బృందావన ప్రతిమను ఇస్తున్న రాఘవేంద్రరెడ్డి, సోదరులు, తనయులు


శ్రీనివాసరావును శాలువా, పూలమాలతో సన్మానిస్తున్న అమర్నాథరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, సోదరులు

మంత్రాలయం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు శుక్రవారం నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి స్వగ్రామమైన మాధవరంకు రావాలని ఆహ్వానించారు. ఆయనకు అల్పాహారం ఏర్పాటు చేసి సన్మానించారు. అదేగ్రామంలో బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అమర్నాథరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి ఇంటికి వెళ్లడంతో వారి సోదరులు శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు. తమపై ఎన్నో కేసులు ఉన్నాయని, తమను పార్టీ కార్యక్రమాలకు పిలవడం లేదని రాష్ట్ర అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో మాట్లడి న్యాయంచేస్తానని హామీ ఇచ్చారు. ఒకే గ్రామంలో రెండు టీడీపీ గ్రూపు నాయకులు పోటాపోటీగా తమ ఇళ్లకు ఆహ్వానించి పోటాపోటీగా సన్మానాలు చేయడంతో నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో మాధవరం మార్మోగింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్వర్లు, మంచాల సింగిల్ విండో అధ్యక్షుడు రామకృష్టారెడ్డి, రాకేష్ రెడ్డి, రాజారెడ్డి, శివరామిరెడ్డి, రాఘవేంద్రరెడ్డి, సాయికుమార్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, మల్లికార్జున, ఎంపీటీసీ వెంకటేష్, పవన్‌కుమార్, చిన్నభీమాలు, రామకృష్ణ, రాఘ వేంద్ర, భీమిరెడ్డి, భూదిరెడ్డి, నాగరాజు, నర్సరెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

కేజీబీవీలో కనీస సౌకర్యాలు కల్పించాలి


కేజీబీవీని పరిశీలిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కౌతాళం, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కౌతాళం కేజీబీవీలో కనీస సౌకర్యాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ మండల మహిళా కన్వీనర్లు లత, మానస, నాగరత్న, సంగీత అన్నారు. శుక్రవారం కేజీబీవీని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం కల్పించకుండా విద్యార్థులకు తక్కువ అన్నం వడ్డిస్తూ కడుపులు మాడుస్తున్నారని తెలిపారు. అలాగే విద్యార్థులకు మినరల్ వాటర్‌ను అందించాలని, మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలని తెలిపారు. ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు, కార్యదర్శి హనుమేష్, సాయివర్మ, కార్యవర్గ సభ్యులు గురు బసవరాజు తాలుకా సభ్యులు మహేష్, మంజునాథ, నాయకులు శివ, రవి ఉన్నారు.

రోడ్డు వేయాలి: సీపీఐ


నిరసన తెలుపుతున్న నాయకులు

పెద్దకడబూరు, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): కంబళదిన్నె-ఎమ్మిగనూరు రోడ్డును వేయాలని సీపీఐ నాయకులు భాస్కర్‌యాదవ్, సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, చంద్ర, తిక్కన్న డిమాండ్ చేశారు. శుక్రవారం కంబళదిన్నె రహదారిలో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ కంబళదిన్నె- ఎమ్మిగనూరు రహదారి పూర్తి అధ్వానంగా మారిందన్నారు. నాగరాజు, రాము, బడేసాహెబ్, ఉసేన్‌సాబ్, నాగప్ప పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు పిల్లలు

మంత్రాలయం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని ధర్మస్థలికి వెళ్లామనుకున్న ముగ్గురు విద్యార్థులు గురువారం తప్పిపోయి మంత్రాలయానికి వచ్చారు. స్కూల్ యూనిఫాంలోనే పుస్తకాల బ్యాగ్‌తో మంత్రాలయం ఆర్టీసీ బస్టాండ్‌లో ఏడుస్తుండగా అక్కడున్న ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు విద్యార్థులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించారు. బెంగళూరుకు చెందిన 8వ తరగతి చదువుతున్న విశాల్, రంజిత్, తనీష్‌తో పాటు వచ్చిన మరోఇద్దరు విద్యార్థులు పాఠశాల వదిలిన తర్వాత ధర్మస్థలికి వెళ్లామని నిర్ణయించుకుని కర్ణాటక బస్టాండుకు వచ్చారు. శుక్రవారం 8గంటల సమయంలోవిశాల్ తండ్రి మోహన్‌కుమార్, రంజిత్ తండ్రి చిన్నప్ప, తనీష్ తాత మునిరాజయ్యలకు ఎస్ఐ శివాంజల్ ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. రాఘవేంద్రస్వామి దర్శనంచేయించి బెంగళూరుకు పంపించారు.



శ్రీమఠంలో నిత్య పూజలకు విరామం

మంత్రాలయం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో జరిగే నిత్య పూజలకు విరామం కల్పించారు. శుక్రవారం ఏకాద శి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషే కాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, టెంకాయ కొట్టడం, పరిమళ ప్రసాదం బంద్ చేశారు. దీంతో మఠంపీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులతో కేవలం బృందావనా నికి నిర్మల విస ర్జనం నిర్వహించారు. అలంకరణ లేని రాఘవేంద్రస్వామి బృందావనాన్ని భక్తులు దర్శించుకున్నారు.

'ప్రైవేటుకు అప్పగించడం దారుణం'

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మెడికల్ కళాశాలలు, ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులకు, కార్యకర్తలకు అప్పగించడం దారుణమని మున్సిపల్ వైస్ చైర్మన్, వైసీపీ నాయకుడు నజీర్ అన్నారు. 9వ వార్డులో శుక్రవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. నజీర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులు ప్రజల సొంతమని, వాటిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. చిన్న, రాజారత్నం, నాగేషప్ప ఉన్నారు.

మోదీ పర్యటనతో ఒరిగిందేమీ లేదు: సీపీఎం

ఎమ్మిగనూరు టౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ కర్నూలు జిల్లా పర్యటనతో ప్రజలకు ఒరిగిందేమీలేదని సీపీఎం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి గోవిందు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లాకు, పశ్చిమ ప్రాంత రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రాయలసీమ అభివృద్ధికి, ప్రత్యేక నిధులు కేటాయింపు ప్రస్తావన రాకపోవటంపై విచారం వ్యక్తం చేశారు. రమేశ్, అబ్దుల్లా, రాజు, తిమ్మప్ప తదిరులు పాల్గొన్నారు.



'కఠినంగా శిక్షించాలి'


కోసిగిలో ర్యాలీ చేస్తున్న నాయకులు

కోసిగి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు హనుమంతు, ప్రతాప్ డిమాండ్ చేశారు. శుక్రవారం కోసిగిలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున దళితులు నల్లజెండాలతో ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేసి బైటాయించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు సోల్మాన్ రాజు, సామేల్, దేవన్న, జయన్న, చిదానంద, కృష్ణ, ఎంపీఈసీ రాజు, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.